హనీబీఎపి

సంపుటి 3, సంచిక 4

జనవరి - ఫిబ్రవరి 2015

# పల్లెసృజన

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక

www.pallesrujana.org

## సన్నకారు రైతుకై నానో ట్రాక్టర్ 'బ్రహ్మచారి' సృజన








రెడీమేడ్ పూరీ, పరోట,
మడత చపాతీలను
చేసే యంత్రాన్ని
తయారు చేసిన
**అద్దంకి జయేశ్వర రావు**

ఒకదానిపై ఒకటి ఆధారపడివున్న ఈ ప్రపంచంలో

# పరస్పర ఆధార తత్వాన్ని మన్నించండి



అనగనగా ఒక రాజు. ఆ రాజుకు ఏడుగురు కొడుకులు, ఒక కుమార్తె ఉన్నారు. ఒకరోజు ఏడుగురు రాజకుమారులు చేపలు పట్టడానికి వెళ్ళి తలావొక చేప పిల్లను తీసుకు వచ్చారు. వాటిని ఎండలో పెట్టింది రాజకుమార్తె. మరునాడు ఉదయం చూస్తే ఒక చేపపిల్ల ఎండలేదు. రాజకుమార్తెకి కుతూహలం కలిగి ఓ చేపా అన్నీ ఎండాయి కానీ, నువ్వు మాత్రం ఎందుకు ఎండలేదు అని అడిగింది. దానికా చేప ఒక గడ్డిమోపు సూర్యునికి నాకు అడ్డువచ్చి నేను ఎండలేదు అంది. రాజకుమార్తె గడ్డిమోపువద్దకెళ్ళి ఎందుకు అడ్డు వచ్చావు అని అడిగింది. దానికది ఆవు నన్ను మేయలేదు కనున నేనిలాగే ఎండలో పడివున్నాను అంది. రాజకుమార్తె ఆవు వద్దకెళ్ళి నువ్వు గడ్డిమోపును ఎందుకు మేయలేదు అని అడిగింది. అప్పుడు ఆవు తన దూడ తనవద్ద పాలు త్రాగలేదు కనుక నేను గడ్డి తినలేదు అని అంది. రాజకుమార్తెకి సంతృప్తి కలుగలేదు. గొడ్డ కాపరివద్దకెళ్ళి ఏరా నువ్వు ఆవుని దూడకు పాలివ్వటానికి ఎందుకు వదల్లేదు అని అడిగింది. దానికి వాడు నేనేం చెయ్యను అమ్మగారూ మా ఇంటావిడ నాకు అన్నం పెట్టలేదు, అందుకే నేను వదలలేదు అని సంజాయిషీ ఇచ్చాడు. రాజకుమార్తె పట్టువదలకుండా గొడ్లకాపరి భార్యను తనవద్దకు పిలిపించి, తన దర్యాప్తు కొనసాగించింది. ఏవమ్మా నీవు మా ఆయనకి భోజనం ఎందకు పెట్టలేదు అని ప్రశ్నించింది. దానికామె భయపడుతూ నా బాబు పొద్దట్నుంచి ఒకటే ఏడుస్తున్నాడు అమ్మగారూ వాన్ని సముదాయించటం వల్ల నేను వంట చేయలేదు అని చెప్పింది. రాజకుమార్తె పిల్లవాన్ని ఏరా నువ్వు ఎందుకు ఏడుస్తున్నావు అని అడిగింది. దానికి వాడు నేనేం చేసేది ఒక చీమ నా వేలికి కుట్టింది అని మళ్ళీ ఏడుగు మొదలు పెట్టాడు. రాజకుమార్తె చీమని చీమా చీమా నీవు బాబును ఎందుకు కుట్టావు అని అడిగింది. అప్పుడా చీమ నేనెందుకు కుట్టకూడదు, మరా బాబు నా పుట్టలో వేలు పెట్టి కెలికాడు అందుకే కుట్టాను అన్నది.

ఆ బాబు చీమల పుట్టలో వేలు ఎందుకు పెట్టినట్లు? ఈ కథని మన తెలుగు ప్రాంతాల్లోని పిల్లలకి నానమ్మలు, తాతలు చెపుతూ వుంటారు. కేవలం కథగానే కాక, బహుశా వాళ్ళకి ప్రపంచంలో ఒకదానిపై మరొకటి ఆధారపడి వుంటాయి, దానికి మనం అడ్డు రాకూడదు అని తెలియజేయటానికేనేమో!

– హనీబీ – 8(2) 1997

Vol-3, Issue - 4 PALLE SRUJANA Jan - Feb 2015

NIF టోల్ ఫ్రీ నెంబర్
1800 233 5555

# పల్లెసృజన

సంపుటి-3 సంచిక - 4

జనవరి-ఫిబ్రవరి 2015

## సంపాదకవర్గం

ప్రధాన సంపాదకులు :
బ్రిగేడియర్
పోగుల గణేశం (రిటైర్డ్)

సంపాదకులు :
జమ్మలమడక శశిమోహన్

ఉప సంపాదకులు :
పల్లె వీర రాఘవ రెడ్డి

సలహాదారులు :
డా. కె.ఎల్. రావు
ప్రొ. అనిల్ గుప్త
డా. గీర్వాణి
శ్రీ పి. చంద్రకాంత్ శర్మ
జాగర్లమూడి దుర్గాప్రసాద్
శ్రీమతి అరుణ గణేశం
శ్రీ జమ్మలమడక శ్రీకర్

కార్టూన్లు :
వెంకట్

## ఈ సంచికలో...


- 'గ్రాస్‌రూట్స్ ఎంటర్‌ప్రెన్యూర్' కావాలనుందా? - 3
- రేలక్ష లోపు విలువతో నానోట్రాక్టరు బ్రహ్మాచారి సృజన - 4
- రైతన్న భావం - 8
- యువతకు ఉపాధి, ధాబా యజమానులకు ఊరట - 9
- సౌరశక్తితో పనిచేసే 'దీపపు ఎర' - 13
- రైతులకొరకు రైతులు తయారు చేసిన అద్భుత యాంత్రిక ఆవిష్కరణలు - 16
- శతమానం భవతి - 18
- ఇగ్నైట్-14 విజేతలు - 20
- 33వ జాతీయ స్థాయి శోధయాత్ర - 24
- వివిధ రాష్ట్రాల నుండి సేకరించిన పల్లె జ్ఞానం - 29
- స్పందన - 32

కవర్ లోపలి పేజీల్లో ....
హనీబీ కథ
రైతులకోసం రైతులు కనిపెట్టిన ఇన్నోవేషన్లు


ఎడిటోరియల్ అడ్రస్ :
పల్లెసృజన, 102,
వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్.
పిన్- 500 094.
ఫోన్ :
040-27111959
98660 01678
E-mail :
editor@pallesrujana.org
www.pallesrujana.org

డి.టి.పి. & డిజైనింగ్ :
నరేంద్ర గ్రాఫిక్స్, హైదరాబాద్.
040- 40029002
81257 99904
E-mail :
narendragrafixhyd@gmail.com

## HoneyBee Regional Collaborators & Publications

**Honey Bee C/o Prof. Anil Gupta**
Indian Institute of Management
Vastrapur, Ahmedabad - 380 015.
Gujarat, India. Ph.: 91-79-26324927, Fax : 91-79-26307341
E-mail : honeybee@sristi.org. http://www.sristi.org

**Aama Akha Pakha (Oriya)**
**Dr. Balaram Sahu,**
3R BP 5/2, BP Colony, Unit-8,
Bhubaneswar-751 012.Orissa.
E-mail : balaram_sahu@hotmail.com

**Hittalagida (Kannada)**
**Dr. T.N. Prakash**
Department of Agricultural Economics,
University of Agricultural Economics,
GKVK, Bangalore-560 065.
E-mail : prakashtnk@yahoo.com

**Num Vali Velanmai (Tamil)**
**P. Vivekanandan,**
SEVA, 45, T.P.M.Nagar,
Virattipathu, Madurai - 625 010.
Tamil Nadu, India.
Phone: 0452 - 238 09 43(O), 0452- 238 36 19 ®
e-mail: vivekseva@gmail.com

**Loksarvani (Gujarati) and**
**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P.O. Box No. 1550.
Ambawadi, Ahmedabad - 380 015.
E-mail : loksarvani@sristi.org
sujhbujh@sristi.org

**Ini Karshakan Samsarikkatte**
**(Malayalam)**
**James T J,**
Peemade Development Society,
Peermade, Idukki-685 531, Kerala.
E-mail : pedes@md2.vsnl.net.in

Printed & Published by **Brig. Pogula Ganesham,** Owner and Printed at **M/s Narendra Graphics,** 1-5-1055/2/14, Flat No. 102, B. Block, Silver Springs Residency, Saibaba Nagar, Old Alwal, Secunderabad - 500 010. Ph.: 81257 99904 and Published at 102, Vayupuri, Sainikpuri Post, Secunderabad-500 094, A.P. Ph.: 040-27118555, Mobile : 098660 01678. Editor Sri J. Sesimohan.

Vol-3, Issue - 4 PALLE SRUJANA Jan - Feb 2015

# "సంవేదన" మన ఆలోచనల్లో చోటు చేసుకుంటుందా !

'వేదన' అంటే బాధ. "సంవేదన" అంటే ఇతరుల బాధలను సంపూర్ణంగా అర్థం చేసుకొని ఆ బాధను తాము అనుభవించడం. ఆ బాధను అంతర్గతం చేసుకోడంతో ఇతరుల ఆవేదన మనదై పోతుంది. ఇతరుల బాధను సంపూర్తిగా అనుభవించినపుడు దాని పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తాం. ఆ పరిష్కారం వేదనని పూర్తిగా తీసివేసే విధంగా ఉంటుంది. ఇలాంటి పరిష్కారాలే "గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్స్" (అట్టడుగు స్థాయి సృజనలు). ఇతరుల సమస్యలను, బాధలను పరిష్కరించడంలోనే వీరికి ఆనందం ఉంది. మల్లేశం 'ఆసు మిషన్', పటాన్ సైదా 'విండ్‌మిల్', సుభాని 'బూమ్ స్ప్రేయర్', మల్లేశం 'సోలార్ స్ప్రేయర్', చంద్రశేఖర్ 'శ్రీతైలం', మహిపాల్ చారి 'వీడర్' మొదలైనవి ఈ 'సంవేదన' ఫలితాలే.

సంవేదన నుంచి పుట్టిన ఇన్నోవేషన్లు సమాజంలోని అన్ని వర్గాలనుంచి రావాలి. గ్రామీణ ప్రజల మేధస్సును గుర్తించి వారికి తోడుగా వుండి, సహకరిస్తూ గ్రామీణ మేథావుల పరిష్కారాలను సమాజంలోని అన్ని వర్గాలకు ఫలితాన్నిచ్చేలా తోడ్పడాలి. పరస్పర గౌరవం వున్నపుడే ఇది సాధ్యపడుతుంది. జ్ఞానానికి సంబంధించి జరిపే చర్చలలో చదువు ప్రధానం కాదు. కేవలం చదువుకున్నంత మాత్రాన జ్ఞానమున్నట్టు రుజువు లేదు. జ్ఞానం మాత్రమే ఆధిక్యతను ఇస్తుంది. జ్ఞానం ఎక్కడున్నా దాన్ని గౌరవించాలి, నేర్చుకోవాలి, సమాజ కళ్యాణం కోసం ఉపయోగించాలి.

భగవంతుడు మనల్ని పుట్టించాడు. మనం జీవించటం కోసం వేర్వేరు వృత్తులను కల్పించుకొన్నాం, వాటిని సులభతరం చేయడానికి/ అభివృద్ధి చేయడానికి ఇంజనీరింగు పరిష్కారాలను వాడుతున్నాము. అయితే ఈ ఇంజనీరింగ్, టెక్నాలజీ ఉపయోగించి రూపొందించిన యంత్రాలు, సాధనాలు అంత సమర్థవంతంగా లేవు. కారణం సామాన్య ప్రజలకు అనుగుణంగా, అందుబాటులో అవి లేకపోవటమేనేమో! లేదా మనకి ఏమి కావాలో ఇంజనీర్లకి మనము సరిగ్గా చెప్పలేక పోయామేమో. లేదా మనకి ఏమి కావాలో వాళ్ళు సరిగ్గా అర్థం చేసుకోలేదేమో. ఉదాహరణకి మనం వాడే చేతిపనిముట్లలో గత యాభై సంవత్సరాల్లో పెద్దగా మార్పులు రాలేదు. అదేవిధంగా సైకిలు ఆధారిత పనిముట్లు, సాధనలు ఎక్కువగా అందుబాటులో లేవు. ఇలాంటివన్నీ సామాన్య రైతులకు ఎంతో ఉపయోగంగా ఉండటమే కాక, వారి పెట్టుబడి ఖర్చులను తగ్గిస్తాయి. కంపెనీ బోర్డు రూముల్లో కూర్చుని వ్యవసాయ పనిముట్ల నిర్ణయాలు చేసేవారు సైకిలు తొక్కడం మర్చిపోయి వుండటమే దీనికి కారణమేమో. ఇంజనీరింగ్ కాలేజీల్లో ఈ ఆలోచనలను విద్యార్థులకు చెప్పి వారిద్వారా ఇలాంటి సమస్యలకి పరిష్కారాలు వెతకడానికి ఉద్యుక్తులను చేసేలా పాఠ్య విధానంలో మార్పులు రావాలి. చైనాలో కొన్ని లక్షల మంది యూనివర్శిటీ విద్యార్థులు అక్కడి గ్రామీణవేత్తల ఆలోచనలను అభివృద్ధి చేసి/ మార్పులు చేసి సమాజానికి అందుబాటులో ఉండేలా చేస్తున్నారు. అక్కడ 30 శాతం పేటెంట్లు గ్రామీణ శాస్త్రవేత్తలవేనట. ఇటువంటి కార్యక్రమం మనం చేయలేమా!

శ్రీ అబ్దుల్ కలాం గారి ఆధ్వర్యంలో 'ఎన్.ఐ.ఎఫ్.' చిన్న పిల్లల కోసం "ఇగ్నైట్" పోటీలు ప్రతి సంవత్సరం నిర్వహిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నారు. దీన్ని మనమంతా సమర్థించి విజయవంతం చేయాలి. మన పిల్లలను వీటిలో పాల్గొనటానికి ప్రోత్సహించాలి. వీరి జ్ఞాన పిపాసను, క్రియాశీలతను, ప్రశ్నించే తత్వాన్ని సమాజంలోని సమస్యల పరిష్కారానికి ఉపయోగించాలి. పిల్లలు పరిష్కారాలు వెతకాలి, ఇంజనీర్లు వాటిని సాధనాలుగా తయారు చేయాలి, వ్యాపారవేత్తలు సమాజంలో ఈ సాధనాలను విస్తరింపజేయాలి. ఇలాంటి "ఇన్వర్టెడ్ మాడల్"ను మనం సమర్థించాలి.

ఇంతవరకు పెద్దగా గుర్తింపు పొందని విషయాలపై వ్యాపార యోగ్యత కల్పించాలి. మేనేజ్‌మెంట్ కళాశాలలు, నిపుణులు ఈ కొత్త అవకాశాలు వ్యాపారపరంగా లాభసాటిగా చేపట్టవచ్చునని సమాజానికి అర్థమయ్యేలా చెప్పాలి. ఉదాహరణకు .....

❋ సేంద్రియ పంటలు (ఆర్గానిక్ పంటలు), రసాయనిక ఎరువుల పంటలకంటే లాభకరంగా చేయాలి.
❋ నీటిని వృధా చేయడం కంటే, వర్షం నీటిని కాపాడుకోవటం లాభకరంగా ఉండాలి.
❋ ఉత్పత్తికంటే రీసైక్లింగ్ లాభకరంగా చేయాలి.
❋ చెట్లను కొట్టివేయడంకంటే, చెట్లు పెంచడం లాభకరం చేయాలి.
❋ కార్లు/బస్సులలో ప్రయాణం కంటే నడవటం లాభకరంగా ఉండాలి.
❋ చెత్తను సృష్టించడం కంటే దాని డిస్పోజల్ లాభకరంగా ఉండాలి.

ఏ పనైనా ప్రజలకు, ప్రకృతికి లాభకరంగా చేస్తేనే మొత్తం సమాజం ఆ మార్గంలోనే పోవడానికి సంసిద్ధమవుతుంది. కొత్త అవకాశాలు, నూతన ఆర్థిక విధానాలు, ప్రకృతి ఆధారిత అభివృద్ధి ప్రణాళికలు మూసలో పోసినట్లుగా కాకుండా "సంవేదనా శీల" దిశలో ముందుకు సాగితే "సర్వేజనాః సుఖినోభవంతు" అన్నది సుగమం చేసినవాళ్ళమవుతాం.



భవదీయ

బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం

# Grassroots



# Enterpreneurship

## 'గ్రాస్‌రూట్స్ ఎంటర్‌ప్రెన్యూర్' కావాలనుందా?



గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లను విస్తరింపజేసే వ్యాపార వేత్తలను
గ్రాస్‌రూట్స్ ఎంటర్‌ప్రెన్యూర్స్ అంటారు.
గ్రామీణ జ్ఞానంతో, గ్రామాల్లో, గ్రామీణ వనరులతో,
గ్రామీణ ప్రజల ఉపయోగార్థం, గ్రామీణులకు ఉపాధి కల్పిస్తూ,
గ్రామాల్లోనే ఉత్పత్తి చేసి, గ్రామాల్లోనే అమ్మకం చేసే
వినూత్న వృత్తి "గ్రాస్‌రూట్స్ ఎంటర్‌ప్రెన్యూర్".

మీరూ ఎంటర్‌ప్రెన్యూర్‌గా మారి
మీ గ్రామంలో ఓ ప్రత్యేకత కలిగిన వ్యక్తిగా
తలెత్తుకు తిరగండి.

ఉత్సాహమున్న గ్రామీణ యువత ఈ సదవకాశాన్ని వినియోగించుకొని జీవితంలో ఎంతో ఎత్తుకు ఎదగాలని కోరుకుంటోంది 'పల్లెసృజన'. ఇందుకు నాందిగా మొదటి శిక్షణా తరగతులు '2015 మార్చి, 14'న నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణా తరగతులకు రావాలనుకున్న వారు 4 రోజులు ముందుగా కార్యాలయానికి ఫోన్ చేసి మీ పేరు, చిరునామా, ఫోన్ నెంబరు నమోదు చేసుకోగలరు.

**రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి చివరితేది మార్చి 10, 2015.**
**ఫోన్ : 040-27111959 కు చేసి మీ పేర్లను నమోదు చేసుకోండి.**
**రుసుము రూ. 100/-**

వేదిక : పల్లెసృజన కార్యాలయము,
నెం. 67, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ - 500 094.

ఇంకా వివరాలకై 15 పేజీ చూడండి.

# ₹ లక్ష లోపు విలువతో ట్రాక్టరు
# సన్నకారు రైతుకై నానో ట్రాక్టర్ 'బ్రహ్మచారి' సృజన



వరంగల్ జిల్లా, చేర్యాల మండలం లోని ముస్త్యాల గ్రామానికి చెందిన బ్రహ్మచారి అతి త్వరలో సామాన్య రైతుల పాలిట ఆపద్బంధువు కాబోతున్నాడు అనటంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. దీనికి కారణం అతను తయారు చేసిన చవకైన "నానో ట్రాక్టరు".

గత సంచికలోని 'సంపాదకీయం'లో చెప్పినట్లుగా ప్రభుత్వ లెక్కల ప్రకారమే రాష్ట్రంలో (దేశంలో కూడా) 5 నుండి 10 ఎకరాల లోపు పొలం వున్న వ్యవసాయదారులు 90 శాతం మంది వుంటే, కేవలం 10 శాతం మంది మాత్రమే భూస్వాములు (ఎక్కువ భూమి కలిగిన పెద్ద రైతులు) ఉన్నారు. ప్రస్తుతం కర్మాగారాలు తయారు చేస్తున్న, ప్రభుత్వాలు ప్రచారం చేస్తున్న ఖరీదైన వ్యవసాయ పరికరాలు కేవలం ఆ 10 శాతం మంది రైతులకు మాత్రమే ఉపయోగ పడేలా ఉన్నాయి. మిగిలిన 90 శాతం మంది రైతులు వ్యవసాయ పనిముట్లను, యంత్రాలను కొనలేక, ఆ పదిశాతం మంది రైతులవద్ద కిరాయికి తీసుకుని తమ పనులను చేసుకుంటున్నారు. దీనివల్ల సన్నకారు రైతుల పెట్టుబడులు పెరిగిపోతున్నాయి.

ప్రస్తుతం మనకు అందుబాటులో వున్న వ్యవసాయ పనిముట్లను, యంత్రాలను తయారు చేసే కర్మాగారాలు, ప్రభుత్వ శాఖలు కూడా ఈ విషయాన్ని విస్మరించి తామేదో వ్యవసాయానికి ఎంతో పాటు పడుతున్నామన్న అపోహలో ఉన్నాయి. 90 శాతం రైతు వర్గానికి సరియైన పనిముట్లు సమకూర్చడంలో ఈ సంస్థలన్నీ పూర్తిగా విఫలమయ్యాయి.

కానీ బ్రహ్మచారి లాంటి ఎంతోమంది గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్లు (అట్టడుగు స్థాయి సృజనకర్తలు) రకరకాల పరికరాలను అతి సామాన్య రైతులు కూడా కొనగలిగేలా తక్కువ ధరలో తయారు చేస్తున్నారు. త్వరలోనే ఈ వ్యవసాయ పరికరాలన్నీ సామాన్య రైతులు వినియోగించి, వ్యవసాయాన్ని యాంత్రీకరణ పద్ధతుల్లో కొనసాగించి అభివృద్ధిలోకి వచ్చే కాలం సమీప భవిష్యత్తులో వుందని పల్లెసృజన ఆశిస్తోంది.

ఇక మన బ్రహ్మచారి విషయానికి వస్తే ఇతను చదివింది కేవలం 6వ తరగతి వరకు మాత్రమే. తల్లి



పద్మావతి, తండ్రి జగన్నాథం, భార్య లావణ్య, కూతురు లహరిలతో కూడిన అతి సామాన్య కుటుంబం. ఇతనికి ముగ్గురు అక్కలు ఉన్నారు. వారు పెళ్ళిళ్ళై స్థిరపడిపోయారు. బ్రహ్మచారి వ్యవసాయ పరికరాలను తయారు చేసే వెల్డింగ్ షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తాను తయారు చేసే ప్రతి పరికరంలో ఏదో ఒక కొత్తదనాన్ని చొప్పించే గుణం బ్రహ్మచారిది. ఈయన కుటుంబంలో ఎవ్వరూ పెద్దగా చదువుకోలేదు. కానీ బ్రహ్మచారి భార్య లావణ్య మాత్రం ఇంటర్ వరకు చదువుకున్నది కావటంతో అందరూ ఆమెను ప్రోత్సహించి ఓపన్ యూనివర్సిటీలో డిగ్రీ చదువుకునేందుకు సహకరిస్తున్నారు. నిజమైన మహిళా సాధికారత సాధించిన ఈ కుటుంబం ఆదర్శవంతమైనదని చెప్పవచ్చు. తాము చదువుకోకపోయినా తమ కోడలు చదువుకోవాలి అన్న విశాల హృదయం వున్న ఆ కుటుంబానికి పల్లెసృజన జోహార్లు అర్పిస్తోంది.

ఇతని తండ్రి డబ్బు సంపాదించాలి అన్న విషయంపై ఎక్కువ ధ్యాస పెట్టక అమాయకంగా ఉండిపోవటంతో బ్రహ్మచారి చిన్న వయసులోనే వెల్డింగ్ షాపులో చేరి ఆ వచ్చిన సంపాదనతోనే ముగ్గురు అక్కలకు పెళ్ళిల్లు చేసి, తనకంటూ ఒక ఇల్లు కూడా కట్టుకున్నాడు.

బ్రహ్మచారి సామాన్య రైతులు వ్యవసాయం చేయటంలో పడే బాధలను గమనించి వారికి అందుబాటులో వుండేలా ఒక నానోట్రాక్టరు తయారు చేస్తే బావుంటుంది అని ఆలోచించేవాడు. ప్రస్తుతం మనుషులు తాము నడుస్తూ నడిపే ఎన్నో రకాల ట్రాక్టరు లాంటి పరికరాలు సబ్సిడీలో లభిస్తున్నాయి, వాటిని నడపటానికి కూడా కూలీ పనివారు దొరకక రైతులు ఇబ్బంది పడుతున్నారని గమనించి, ఇలా మనుషులు తోసుకుంటూ నడిపే వాటికన్నా, కూర్చుని నడిపే ట్రాక్టరు తయారు చేస్తే బావుంటుంది కదా అని అనుకున్నాడు. దానివల్ల రైతులకి కూలీల బెడద కూడా తగ్గుతుంది. ఈ ఆలోచన అయితే వచ్చింది కాని, ఒక నానో ట్రాక్టరును తయారు చేయడానికి ఎన్నో సంవత్సరాలు శ్రమించాల్సి వచ్చింది. తన దైనందిక పనులు చేసుకుంటూనే దీని తయారీకి కొంత సమయం కేటాయించాడు. చివరికి సాధించాడు. ఈ నానోట్రాక్టరుతో ఒక గంటలో ఒక ఎకరం పొలం దున్నుకోవచ్చు డీజిలు కూడా గంటకు కేవలం ఒక లీటరు మాత్రమే ఖర్చవుతుంది. దీనికి పవర్ స్టీరింగ్‌ను కూడా ఏర్పాటు చేశాడు. రైతుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తానే స్వయంగా తన పొలాన్ని దున్నుకునేలా ఈ నానోట్రాక్టరును రూపొందించాడు బ్రహ్మచారి. దీని వెడల్పు 30 అంగుళాలు, పొడవు 4 అడుగులు, ఎత్తు 3 అడుగులు మాత్రమే వుంటుంది.

ఈ నానో ట్రాక్టరు తయారీకి 4 హార్స్‌పవర్ శక్తిగల డీజిల్ ఇంజన్‌ను అమర్చాడు. ఈ ట్రాక్టరు తయారీలో చిన్న టైరు లభించకపోవటంతో ఇంతకాలం ఆగాల్సి వచ్చింది. మనిషి నడిపే ట్రిల్లర్‌లకు కూడా ట్రాక్టర్ మాడల్‌లోని టైర్లే వినియోగించటంతో బ్రహ్మచారి పని సులువైంది. ఆ టైర్లను నానోట్రాక్టరుకు వినియోగించాడు. తాను అనుకున్న విధంగా నానోట్రాక్టరు తయారు చేసిన తర్వాత ఎంత లోతుగా దున్నుతుందోనని ప్రయోగించి చూసాడు. ఇది దాదాపు పెద్ద



**మీరు చివరిసారిగా ఒక ఇన్నోవేటర్‌ని ఎప్పుడు కలిశారు?**

ట్రాక్టరు దున్నినంత లోతుగా దున్నుతోందని గ్రహించాడు. నానోట్రాక్టరు 10 నుండి 15 కి.మీ. వేగంతో పయనిస్తుంది కానీ లోడు మాత్రం దాదాపు పెద్ద ట్రాక్టర్లతో సమానంగా తీసుకుంటుంది అంటాడు బ్రహ్మచారి.

ఈ ట్రాక్టరు ముఖ్యంగా పత్తి, కంది లాంటి పంటలలో అంతర సేద్యాలకు, మరీ ముఖ్యంగా పండ్ల తోటల్లో సేద్యాలకు చాలా అనువుగా వుంటుంది. వరి సేద్యం కూడా ఈ నానోట్రాక్టరుతో సాధ్యమౌతుంది. మామిడి తోటల్లో చెట్లచుట్టూ తిప్పుతూ సేద్యం చేయవచ్చు. బొప్పాయి లాంటి తోటల్లో చెట్ల మధ్య సేద్యం చేయటానికి అనువుగా వుంటుంది. ఈ నానోట్రాక్టరును చూసి ఆ గ్రామ రైతులు ఇది విజయవంతం అయిందంటే ఇక ఎద్దులతో పనిలేదు అని బ్రహ్మచారిని అభినందించారు. పని చేయటం చేతగాని ముసలి, ముతక రైతులు కూడా ఈ ట్రాక్టరును వినియోగించుకుని తమ వ్యవసాయ పనులను సులువుగా చేసుకోవచ్చు అంటాడు బ్రహ్మచారి. ఈ నానోట్రాక్టరు అంతా లివర్ల ఆధారంతోనే చేతుల ద్వారానే నడుస్తుంది కాబట్టి కాళ్ళు లేని రైతులు కూడా దీన్ని నడపవచ్చు. దీనికి గేర్లు ఉండవు, కేవలం ముందుకు, వెనక్కు నడిపేలా మాత్రమే గేరు వుంటుంది. దీని వేగం అంతా కేవలం బెల్టు ద్వారానే అనుసంధానించబడి వుంది. దీన్ని నడపటానికి రైతుకు పెద్దగా అనుభవం కూడా అవసరం లేదు.

ప్రస్తుతం మార్కెట్లో సామాన్య రైతుకు అందుబాటు ధరలో ఎన్నో రకాల టిల్లర్‌లు లభిస్తున్నాయి. కానీ వాటిని కూర్చుని నడిపే విధంగా తయారు చేయలేదు. తాను తయారు చేసిన ఈ నానోట్రాక్టరు వల్ల అన్ని రకాల పనులను కూర్చుని ట్రాక్టరు నడుపుకుంటూ చేసుకుపోవచ్చు. అంతేకాకుండా ఎద్దులతో సేద్యం చేయాలన్నా ఎకరాకు రూ.





500 వరకు ఖర్చవుతుందని, కానీ ఈ ట్రాక్టరు ద్వారా కేవలం ఒక లీటరు డీజిల్‌తో రైతు గంటకు ఒక ఎకరం చొప్పున దున్నుకోవచ్చు అంటాడు. ఈ ట్రాక్టరుకు ట్రాలీని జోడించి పొలానికి మందు బస్తాలు లాంటివి కూడా తీసుకు వెళ్ళవచ్చు. దాదాపు 10 క్వింటాళ్ళ లోడు లాగుతుందని చెప్పాడు బ్రహ్మచారి. ఈయన అంతకు ముందే ఒక వెల్డింగ్ మిషన్ కూడా తానే స్వయంగా తయారు చేసుకున్నాడు.

ఈ నానో ట్రాక్టరు ధర ఎంత అని బ్రహ్మచారిని అడుగగా, రెండు ఎద్దుల ధరకంటే తక్కువగానే వుంటుందని చెప్పాడు. ఎంత అందంగా రైతుల భాషలో జవాబు చెప్పాడు కదా! నానో ట్రాక్టరు డిజైన్ చేసేటప్పుడు బ్రహ్మచారి ధర గురించి ఒక ఆంక్ష పెట్టుకున్నాడు. ఆ ఆంక్ష వల్ల సన్నకారు రైతులకు నానోట్రాక్టరు తప్పక అందుబాటు ధరలో వుంటుందన్న విశ్వాసం బ్రహ్మచారిది. ఈయనలాగా మన సైంటిస్టులు కూడా ఆంక్షలు పెట్టుకొని పరిశోధనలు చేస్తే దేశంలో మెజారిటీ రైతులకు పరికరాలు అందుబాటులో వుంటాయి.

నానోట్రాక్టరు కావాలనుకున్న రైతులు ఆర్డరు ఇచ్చిన రెండు నెలలకు కేవలం రూ. 75,000లకే తయారు చేసి ఇస్తానని అంటున్నాడు. ఈ ట్రాక్టరు కేవలం 4 హార్స్‌పవర్‌ల డీజిల్ ఇంజన్‌తో తయారైంది కాబట్టి దీనికి రిజిస్ట్రేషన్‌తో అవసరం లేదని బ్రహ్మచారి భావిస్తున్నాడు.

ఈ నానోట్రాక్టరుకు లూనా గేర్ బాక్స్‌ను వాడటం జరిగింది. కావున ఇందులో హైడ్రాలిక్ సదుపాయం వుండదు. అది కూడా కావాలంటే ఏర్పాటు చేస్తాడు కానీ, దానికి కొంత ఖరీదవుతుంది. మనం ఎంత లోతుగా దున్నాలి



అనుకున్నామో అంతవరకే లివర్ ఏర్పాటు చేసుకుంటే సరిపోతుంది. భూమిలో ఏదైనా రాయి లాంటిది గొర్రుకు తగిలితే లివర్ పైకి లేపి ఆ తర్వాత మళ్ళీ కిందకు దించుకుని సేద్యం చేయాల్సి వుంటుంది. ఈ ట్రాక్టరుకు పొలంలో పేడ ఎరువును వేసి చదును చేయటానికి డోజర్‌ను కూడా తయారు చేశాడు. ఈ ట్రాక్టరుకు మెయింటెనెన్స్ కూడా ఏమీ వుండదు. కేవలం బేరింగుల వద్ద గ్రీజు అప్పుడప్పుడూ పెడుతూ వుండాలి అంతే. కేవలం ఇంజన్ ఆయిల్, డీజిల్ మాత్రం వినియోగించాల్సి వుంటుంది.

నానో ట్రాక్టరు నిర్మాణంలో వరికోత యంత్రానికి చెందిన కొన్ని విడిభాగాలు వాడబడ్డాయి. ముఖ్యంగా చైన్ స్ప్రాకెట్ ఈ యంత్రానిది వాడటం వల్ల ఇది ఎప్పుడైనా పాడైపోతే మామూలుగా గ్రామాల్లో ఆయిల్ ఇంజన్‌లు రిపేరు చేసే మెకానిక్ ఈ చైన్ స్ప్రాకెట్‌ని మార్చగలడు అంటాడు బ్రహ్మచారి.

నానోట్రాక్టరు అతి సామాన్య రైతు సేద్యానికి ఎంతో ఉపయోగ పడటంతో పాటు ట్రాలీని కూడా ఏర్పాటు చేసుకుంటే ఇంకా బాగుంటుందని, ఇది గ్రామ పంచాయితీలలో చెత్త లాంటివి తొలగించటానికి ఉపయోగించుకోవచ్చు అంటాడు బ్రహ్మచారి. ఎందుకంటే ఇది అతి చిన్న ట్రాక్టరు కాబట్టి గ్రామాల్లోని చిన్న చిన్న సందుల్లోకి కూడా వెలుతుంది. మండలం, మున్సిపాలిటీలలో కూడా ఇది చిన్న వీధులలో చెత్తను సేకరించేందుకు చాలా అనువుగా వుంటుంది అంటాడు.

నానోట్రాక్టరు వేగం 10 కి.మీ.కు మించకపోయినా, లోడు సామర్థ్యం మాత్రం ఎక్కువగా వుండేలా తయారు చేశాడు. బ్రహ్మచారి తయారు చేసిన ఈ నానోట్రాక్టరును రాష్ట్రపతి అవార్డుకు నమోదు చేయటమే కాకుండా, పేటెంట్‌కు కూడా 'ప్లస్సృజన' కృషి చేస్తోంది. త్వరలోనే నానోట్రాక్టర్ మార్కెట్లోకి రావటానికి 'పల్లెసృజన' అన్ని చర్యలు తీసుకుంటోంది.

**వివరాలకు పల్లెసృజన కార్యాలయాన్ని సంప్రదించ గలరు.** ●

## పల్లెసృజన కార్యాలయంలో ఇన్నోవేషన్ల విస్తృత కేంద్రం

**దేశవ్యాప్తంగా పునాదిస్థాయి ఇన్నోవేటర్లు (గ్రామీణ శాస్త్రవేత్తలు) తయారు చేసిన ఇన్నోవేషన్ల ప్రదర్శన 'పల్లెసృజన' కార్యాలయంలో ఏర్పాటు చేయడమైనది. ఈ ప్రదర్శనను పాఠశాల, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, రైతులు సందర్శిస్తున్నారు. రైతులు ఈప్రదర్శనను చూస్తే వారికి అవసరమైన పనిముట్లను గుర్తించి వాటిని లాభకరంగా వినియోగించుకునే అవకాశం లభించటంతో పాటు, దేశీయ జ్ఞానానికి చేయూతను అందించిన వారవుతారు. మీ సమస్యలను పల్లెసృజనతో చర్చించవచ్చు.**



విక్రం రాథోడ్ సైకిల్ పంపు




రోషన్‌లాల్ విశ్వకర్మ చెరుకు కణుపులను కత్తిరించే సాధనం



గోపాల్ భిసే సైకిల్ నాగలి





మల్లేష్‌సోలార్ స్ప్రేయర్, రైటు ఫ్యాన్ల రిమోట్

**హైదరాబాద్ వచ్చినపుడు 'పల్లెసృజన' కార్యాలయాన్ని తప్పక దర్శించండి.**
**ముందుగా మా కార్యాలయానికి సందేశాన్నిస్తే మీ సందర్శనను అర్థవంతంగా చేస్తాం.**

'పల్లెసృజన' కార్యాలయం చిరునామా :
**67, రోడ్ నెం. 2, వాయుపురి, సైనిక్‌పురి పోస్టు, సికింద్రాబాద్ - 500 094.**
**ఫోన్ : 040-27111959, సెల్ : 9866 00 1678.**



పల్లెసృజన 'మన్మథనామ సంవత్సర' ఉగాది సందర్భంగా

# రైతన్న భావం

## రైతుల భావ ప్రకటన పోటీలు



*ఈ పోటీ పాఠశాల, కళాశాల విద్యార్థులకి కాదు!*
*మొట్టమొదటిసారి కేవలం పొలాల్లో స్వయంగా కష్టించి, పంట పండించే కృషీవలులకై ప్రత్యేకించి ఈ పోటీ నిర్వహించాలని 'పల్లెసృజన' నిర్ణయించింది.*

మన్మథ నామ సంవత్సర ఉగాది (21 మార్చి, 2015) 'పల్లెసృజన' "భావ ప్రకటన పోటీలు" నిర్వహిస్తోంది. రైతులకి వారి పొలాలే వారికి కర్మభూమి, అవే వారి ప్రయోగశాలలు. దాన్లో ప్రయోగాలు చేసే రైతులే శాస్త్రవేత్తలు. మీరు మీ పొలాలలో చేసిన ప్రయోగాలు, ఆ అనుభవాలు, వాటి ఫలితాలు మీకే సొంతం కాకుండా, వాటిని నలుగురికీ చెప్పుకునేందుకు, ప్రభుత్వ శాస్త్రజ్ఞుల, పారిశ్రామిక వ్యవస్థల ప్రభావం మీ జీవనశైలిపై మీ వృత్తి వ్యవహారాలపై ఎలావుందో, వాటి పర్యవసానాలు ఏమిటో మీ మనసులో మాటలు చెప్పుకోవడానికి ఇదో అవకాశం. నలుగురికీ మేలు చేయటంతో పాటు మీకూ గుర్తింపు/ బహుమానం గెలుచుకునే సదవకాశం 'పల్లెసృజన' కల్పిస్తోంది.

**అంశం:**

**"ప్రకృతి రక్షణకు, సమస్థ జీవ క్షేమానికి సేంద్రియ వ్యవసాయం చేపట్టక తప్పదని అందరికీ అర్థమైంది. రసాయనాల నుండి సేంద్రియానికి వ్యవసాయ మార్పిడి ఎలా చేయాలన్నది అయోమయంగా ఉంది. ఈ నేపథ్యంలో సేంద్రియ వ్యవసాయం ప్రాచుర్యం పొందాలంటే ఏమి చేయాలి? ప్రభుత్వపరంగా, ప్రభుత్వేతరంగా చేపట్టవలసిన కార్యక్రమాలు ఏమిటి? రైతుల పాత్రమ ఏమిటి?"**

**నిబంధనలు:**

1 స్వయంగా వ్యవసాయం చేస్తున్న రైతులు మాత్రమే ఈ పోటీలో పాల్గొనటానికి అర్హులు.

2 మీరు స్వయంగా కాని, మీరు చెప్తుంటే ఇంకెవరైనా కాని వ్రాసి పంపించవచ్చు.

3. వ్యాసం తెలుగులో మాత్రమే వ్రాయాలి. 6 పేజీలకు మించకుండా ఉండాలి.

4. మీ పేరు, చిరునామా, ఫోన్ నెంబరు, ఫోటో పంపండి.

5. మీ వ్యాసానికి సంబంధించిన విషయంపై ఫోటోలు ఏవైనా వుంటే వాటిని కూడా జతచేయవచ్చు.

6. మీ వ్యాసాలు ఈ-మెయిల్‌లో కాని, పోస్టులో కాని పల్లెసృజన కార్యాలయానికి పంపండి.

7. మీ భావాలు మాకు చేరవలసిన ఆఖరు తేది **28 ఫిబ్రవరి, 2015**.

**బహుమతుల వివరాలు:**

❀ మొదటి బహుమతి రూ. 1,116/-లు + 3 సంవత్సరాల 'పల్లెసృజన' పంపబడుతుంది.

❀ రెండవ బహుమతి రూ. 750/-లు + 2 సంవత్సరాలు 'పల్లెసృజన' పంపబడుతుంది.

❀ మూడవ బహుమతి రూ. 500/-లు + ఒక సంవత్సరం 'పల్లెసృజన' పంపబడుతుంది.

❀ నాల్గవ బసుమతి రెండు వ్యాసాలకు ప్రోత్సాహకంగా ఒక సంవత్సరం 'పల్లెసృజన' పంపబడుతుంది.

❀ పోటీలో పాల్గొన్న వారందరికీ 3 'పల్లెసృజన' పత్రికలు ప్రోత్సాహకరంగా పంపడం జరుగుతుంది.

**ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మీ భావాల్ని నలుగురికీ చేరవేయాలన్న మా ఈ ప్రయత్నంలో పాల్గొని దిగ్విజయం చేస్తారని ఆశిస్తున్నాము. -ఎడిటర్.**

**<u>మీ వ్యాసాలు పంపాల్సిన చిరునామా :</u>**

**ఉగాది రైతన్న భావం పోటీలు,**
**పల్లెసృజన, 67, వాయుపురి, సైనిక్‌పురి పోస్టు,**
**సికింద్రాబాద్ - 500 094.**
**ఇ-మెయిల్ : editor@pallesrujana.org**

# ఆఖరు తేది 10 మార్చి, 2015 .

## రెడీమేడ్ పూరీ, పరోట, మడత చపాతీ తయారీ యంత్రంతో

# యువతకు ఉపాధి, ధాబా యజమానులకు ఊరట



### ఆహార పరిశ్రమకు తోడుగా ఎ.జె. రావు ఇన్నోవేషన్

అనంతపురం జిల్లా గోరంట్ల మండల కేంద్రానికి చెందిన అద్దంకి జయేశ్వర్ రావు (ఎ.జె. రావు) గతంలో నిర్మాణ రంగానికి సంబంధించిన 'లెవెలింగ్ మిషన్', మహిళలు, చిన్నపాటి హోటల్ యజమానులకు ఊరటనిచ్చే 'కూరగాయలు కత్తిరించే యంత్రం' తయారీ ద్వారా 'పల్లెసృజన' పాఠకులకు సుపరిచితమే.

తన ఆలోచనలకు ఎప్పుడూ పదును పెడుతూ, తనకంటూ ఓ స్థానాన్ని సంపాదించుకోవాలని, సామాన్య జనావళికి అందుబాటులో వుండేలా రకరకాల వస్తువులను కనుగొనడం, తయారు చేయాలన్న సంకల్పంతో వుండే ఎ.జె. రావు ఈసారి మరో కొత్త ఆలోచనతో మనముందుకు వచ్చాడు.

దేశంలోని అన్ని ప్రధాన రహదారుల వెంట ధాబాలు ఉంటాయన్న సంగతి అందరికీ తెలుసు. ఈ ధాబాలలో ప్రధాన వంటకం చపాతి, పరోట, పుల్కా, పూరి. వీటిని తయారు చేయటానికి ఒక ప్రత్యేక వంట మనిషితో పాటు చపాతి రుద్దేందుకు కూడా ఒక వ్యక్తి అవసరం. అయితే ప్రతి ధాబా యజమానులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య చపాతి చేసే మనుషుల కొరత. ఈ వ్యక్తులకు నెలకు దాదాపు 20 వేల దాకా ఖర్చవుతుంది. పైగా వీరు ఎప్పుడు పని ఎగ్గొడతారో తెలియక పోవటంతో చాలా ఇబ్బందుల పాలవటం గమనించాడు ఎజె రావు. ఈ సమస్యకు పరిష్కారంగా ఎక్కువ మోతాదులో చపాతీలు తయారు చేసే యంత్రాలు ఉన్నాయి కానీ, అవి ఖరీదుతో కూడుకున్నవే కాక, హోటల్ యజమానుల అవసరాన్ని అనుకున్న స్థాయిలో తీర్చలేక పోతున్నాయి.

ఈ సమస్య పరిష్కారంగా ఎజె రావు తయారు చేసిన ఈ యంత్రాన్ని రహదారిలో వున్న గ్రామీణ యువతీ యువకులు తమ నిరుద్యోగ సమస్యకు పరిష్కారంగా చేసుకుని స్వంత వ్యాపారాన్ని చేసుకోవచ్చు. దీని

సహాయంతో పూరి, చపాతి, పరోటాలను తయారు చేసి వాటిని అతి తక్కువ వేడితో కాల్చడం, వాటిని నిలువ చేసుకుని ప్రతి రోజు వారి సమీపంలోని అన్ని ధాబాలకు పెద్ద పెద్ద హొటళ్ళకు సరఫరా చేయటం ద్వారా ఉపాధి పొందవచ్చు. హొటళ్ళు, ధాబాల యజమానులు వీటిని సాధారణ వ్యక్తి ద్వారా అప్పటికప్పుడు వినియోగ దారులకు అవసరమైనన్ని చపాతీలు, పుల్కాలు, పరాటాలను వేడి చేసి సరఫరా చేసుకోవచ్చు. ఈ సమస్య పరిష్కారం వల్ల ప్రత్యక్షంగా నిరుద్యోగ యువకుడు, హొటల్ యజమాని లాభం పొందవచ్చు.

ఈ యంత్రాన్ని తయారు చేయటానికి ముందు ఎజె రావు తన మిత్రుడు 'సుకుమార్'తో కలిసి ఇంటర్‌నెట్‌లో రెడీమేడ్ పుల్కాలు తయారు చేసే మిషన్ చూశారు. వాటిని తెచ్చి వ్యాపారం చేద్దామని ఆలోచించి కొంతమంది మిత్రులను ఆర్థిక సహాయం అడిగి దాదాపు 3 లక్షల రూపాయలు మిషన్ కొరకు, మరో 2 లక్షల రూపాయలు ఇతర సామాగ్రి కొరకు వెరసి 5 లక్షల రూపాయలు ఖర్చు చేసి పూనా నుండి యంత్రాన్ని తెప్పించారు. దానితో తయారైన పుల్కాలను తీసుకుని మార్కెట్‌లోకి వెళ్ళగా వాటి పట్ల ఎవరూ ఉత్సుకత చూపలేదు. దానికి కారణం "మీరు పుల్కాలు ఇస్తే మా వంట మాస్టర్లకు సుఖం తప్ప మాకేంటి లాభం. మిగతా పూరీ, పరోట, మడత చపాతి లాంటివి తయారు చేయటానికైనా మాస్టర్‌ని నియమించుకోవాలి కదా, అంతే కాక వీటి సైజు కూడా ఇంకాస్త పెద్దదిగా వుండాలి " అన్నారు. దాంతో వారు అనుకున్న వ్యాపారం జరగక పోగా నిరుత్సాహంతో పాటు నష్టం కూడా జరిగిందని అర్థమైపోయింది.


ప్రయోగాత్మకంగా తయారు చేసిన యంత్రం


అభివృద్ధి చేసిన యంత్రం

ఈ నష్టాన్ని ఎలా పూడ్చుకోవాలి అని ఆలోచిస్తూ పూనా నుండి తెచ్చిన యంత్రాన్ని పరిశీలించడం మొదలు పెట్టాడు ఎజె రావు. ఆ యంత్రంలో కొన్ని లోపాలను గమనించాడు. యంత్రం సరఫరా చేసిన వ్యక్తికి ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఫలితం దక్కలేదు. మిత్రులతో తనకు పుల్కాలు, చపాతి, పరోటా, పూరీ అన్నీ చేయటం వచ్చునని, ఈ యంత్రం నమూనాతో నేనే మరో యంత్రాన్ని రూపొందిస్తాను, దానికి కాస్త డబ్బు వెచ్చించండి అన్ని ధైర్యాన్ని ఇచ్చాడు మిత్రులకు. దాంతో ఎజె రావుమీద వున్న నమ్మకంతో మిత్రులు మరో 5-6 లక్షల రూపాయలను సమకూర్చడం జరిగింది. దాంతో తాను అనుకున్న విధంగా మరో యంత్రాన్ని రూపొందించాడు ఎజె రావు. దాంతో చపాతీ, పరోటా, పూరీల ఫార్ములాలను తయారు చేసి కొంతమందికి శిక్షణ కూడా ఇచ్చాడు.

తాము అనుకున్నట్లుగా అన్నీ తయారైన తర్వాత వీటన్నిటిని ప్యాకెట్లలో వేసి శాంపిల్స్ తీసుకుని గతంలో వెళ్ళిన కష్టమర్ల దగ్గరకి వెళ్ళగా చాలామంది వాటిని


చపాతి తయారు చేయుటకు సిద్ధం

తీసుకోవటానికి మొగ్గు చూపారు. ఇప్పుడు రోజుకు 4 నుండి 5 వేల వరకు చపాతి, పరోటా, పుల్కాలు తయారు చేసి మార్కెట్‌లో అమ్మగలుగుతున్నారు. కేవలం 6 నుండి 8 నెలల శ్రమతో ఈ యంత్రాన్ని విజయవంతంగా తయారు చేయగలిగాడు ఎజె రావు.

అంతటితో ఆగకుండా ఈ రొట్టెలు చేయటానికి పిండి ముద్దను కూడా సరియైన కొలతలతో కత్తిరించి ముద్ద బైటికి వచ్చేలా కూడా మరో అనుబంధ యంత్రాన్ని తయారు చేశాడు. తాను తయారు చేసిన ఈ యంత్రం ద్వారా తయారైన రొట్టెలు 3 నుండి 4 రోజుల వరకు నిల్వ ఉంటాయని, హోటల్ యజమానులు తాము కొనుగోలు చేసిన రొట్టెలు పాడైపోతాయేమో అన్న బెంగ అవసరం లేదు అంటాడు ఎజె రావు.

ప్రస్తుతం ఈ రెడీమేడ్ రొట్టెలు తయారు చేసే యూనిట్ పెట్టాలనుకునే వారు ఎజె రావును నేరుగా సంప్రదించి తమతమ గ్రామాల్లోనే ఈ యూనిట్ ఏర్పాటు చేసుకున్నట్లయితే తమ గ్రామంలో మంచి ఉపాధి పొందవచ్చునని అంటున్నాడు ఎజె రావు. ఈ యూనిట్ ప్రారంభించేందుకు కావలినవి

1. పిండి కలిపే యంత్రం (ధర 33,000/–),
2. ముద్దను కత్తిరించే యంత్రం (ధర 80 నుండి 90 వేలు),
3. ప్రెస్సింగ్ యంత్రం (ధర 1లక్ష 40 వేలు),
4. రొట్టెలను వేడి చేసే డ్రయింగ్ కన్వేయర్ (ధర 60 వేలు),
5. రిఫ్రిజిరేటర్ 400 లీ. (ధర 30 వేలు),
6. ఇతర సామాగ్రి కొరకు (రూ. 80 వేలు)

వెరసి యూనిట్ మొత్తం తయారు కావటానికి 4 నుండి నాలుగున్నర లక్షల దాకా అవుతుందని ఇద్దరు లేదా ముగ్గురు వ్యక్తులు మంచి ఉపాధి పొంటంతో పాటు ఎంతో ఆదాయాన్ని సమకూర్చుకోగలరు అంటున్నాడు.

యంత్రం సరపరా చేసిన తర్వాత ఒక సంవత్సరం వరకు ఉచితంగా సేవలను అందిస్తామంటున్నాడు ఎజె రావు. ఈ యంత్రాన్ని ముఖ్యంగా క్యాటరింగ్ చేసేవారు, క్యాంటీన్, కళాశాలల హాస్టల్‌లు, హోటల్, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్‌ల వారికి ఎంతో ఉపయుక్తంగా వుంటుంది.

యూనిట్ ఏర్పాటు చేయాలనుకునేవారు ఇన్నోవేటర్ ఎ.జె. రావ్‌ను ఫోన్ నెం. : 97009 45435 ద్వారా సంప్రదించి ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందగలరని 'పల్లెసృజన' ఆకాంక్షిస్తోంది.

●


పిండి కలిపే యంత్రం


ముద్దలు కత్తిరించే యంత్రం


వ్యాపారానికి సిద్ధంగా వున్న రొట్టెలు

# నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా

## స్వయం ప్రతిపత్తిగల సంస్థ, శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వము

## జాతీయ 9వ ద్వైవార్షిక పోటీ ప్రకటన పునాది స్థాయిలో సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలు మరియు సంప్రదాయ విజ్ఞానముల గుర్తింపు

**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్** (ఎన్.ఐ.ఎఫ్.), 9వ ద్వైవార్షిక పోటీలకై మనదేశం నలుమూలల్లో పునాది స్థాయిలో దాగివున్న సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలను మరియు సంప్రదాయ విజ్ఞానాన్ని వెలుగులోకి తెచ్చేందుకు ఎన్.ఐ.ఎఫ్. కృషి చేస్తోంది. కర్షకులు, కార్మికులు, జాలరివారు, వర్క్‌షాప్ మెకానిక్‌లు, మురికి వాడలలో నివసించువారు, మహిళలు, విద్యార్థులు మరియు సమాజంలోని ఎవరైనను ఈ పోటీలో పాల్గొనవచ్చును. మీయొక్క ఆవిష్కరణలు వ్యవసాయము (పనిముట్లు, యంత్రములు, క్రొత్త పద్ధతులు, కొత్త వంగడాలు మొదలగునవి), గృహోపకరణాలు, రవాణా, ఎనర్జి (శక్తి) ఉత్పత్తి/పరిరక్షణ, పనిభారం తగ్గించటం, మూలికా వైద్యము (మానవ మరియు జంతు సంబంధమైన) మొదలగువాటికి సంబంధించినవై మరియు తక్కువ ఖర్చుతో కూడుకుని ఎక్కువ కాలం మనగలిగి పర్యావరణానికి హానికరం కానివై ఉండాలి. ఈ ఆవిష్కరణలు మీ సొంత సృజనతో ఎటువంటి సాంకేతిక మద్దతు, పర్యవేక్షణ లేకుండా సహాయం/ గుర్తింపు పొందనివై ఉండాలి. మహిళలు మరియు వికలాంగుల యొక్క ఆవిష్కరణలు/ సంప్రదాయ విజ్ఞానానికి ప్రత్యేక బహుమతులు ఇవ్వబడతాయి. చిన్నపిల్లలను (స్కూల్‌కి వెళ్ళేవారు మరియు వెళ్ళనివారు) వారియొక్క సొంత ఆలోచనలను (Original Ideas) పంపమని ప్రోత్సహిస్తున్నాము. సాంకేతిక ఆవిష్కరణలకు సంబంధించిన నమూనాలు (Prototypes), అభివృద్ధి చేయని సృజనాత్మక ఆలోచనలను (Creative ideas) కూడా ఆహ్వానిస్తున్నాము.

వివిధ కేటగిరీలలో బహుమతి ఒక్కటికి రూ. 10,000 నుండి రూ. 7,50,000 వరకు ఉంటుంది. జీవిత కాలపు, జాతీయ మొదటి, రెండవ, మూడవ పురస్కారాలు పొందిన వారికి బహుమతి మొత్తంలో కొంత భాగాన్ని ఉపకార వేతనము (Fellowship) రూపములో (జీవిత కాలపు పురస్కారం పొందిన వారికి 5 సంవత్సరాలు, జాతీయ మొదటి, రెండవ, మూడవ పురస్కారాలు పొందినవారికి వరుసగా 3 సంవత్సరాలు, 2 సంవత్సరాలు, 1 సంవత్సరము) ఇస్తారు. మొత్తము బహుమతిలో పదిహేను శాతం (15%)ను ఆవిష్కరణకర్త(లు) వారి సమాజ సంక్షేమానికి మరియు ప్రకృతికిసంబంధించిన కార్యక్రమాలలో వినియోగించవలసి ఉంటుంది.

పునాది స్థాయిలో ఆవిష్కరణలను మరియు సంప్రదాయ విజ్ఞానాన్ని ప్రోత్సహిస్తున్న వ్యక్తులకు, సంస్థలకు విలేఖరులకు మరియు ప్రజల యొక్క విజ్ఞానానికి/సృజనాత్మకతకు విలువను జోడించి ప్రభావితం చేస్తున్న నిపుణులకు **ప్రత్యేక గుర్తింపు** ఉంటుంది. వ్యక్తులు లేదా సంస్థలు వారి ఆవిష్కరణలు ఎన్నయినా **31 మార్చి, 2015** లోగా మాకు చేరేలా పంపండి.

**మీ ఆవిష్కరణలను పంపవలసిన చిరునామా :**

**National Innovation Foundation-India, Satellite Complex,**
**Premchand Nagar Road, Ahmedabad -380 015, Gujarat**
**Phone: (079) 26732456, 2095, Fax: (079) 26731903,**
**Email: campaign@nifindia.org,**
**Website: www.nif.org.in**

**గమనిక :** వృత్తిపరమైన నేపథ్యం/ అనుభవం ఉన్నవారు మరియు వృత్తివిద్యా కోర్సులలో ఉన్న విద్యార్థులు ఆవిష్కరణలు / ప్రతిపాదనలు పంపుటకు అర్హులు కారు. అయితే పునాది స్థాయిలో ఆవిష్కరణలకు విలువను జోడించుటకు వారి సేవలను ఎన్.ఐ.ఎఫ్. ఆహ్వానిస్తోంది. అర్హతలు మరియు సూచనలకు సంబంధించి మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ **http://www.nif.org.in/announcement**.చూడండి.

# ఎక్కడికైనా సులభంగా తీసుకు వెళ్ళగలిగే
# సౌరశక్తితో పనిచేసే 'దీపపు ఎర'



- ఆంగ్ల దినపత్రిక 'ది హిందూ' లోని యం.జె. ప్రభు వ్యాసం ఆధారంగా...

పంటలకు కలిగే చీడ పీడల నివారణకి అయ్యే ఖర్చులు రానురాను పెరిగిపోయి, రైతుల రాబడికి గండి కొడుతున్నాయి. విత్తనం నాటిన దగ్గరనుంచి సరుకు మార్కెట్లో అమ్మేదాకా సమర్థవంతంగా, చవకగా ఈ చీడపీడల నివారణలకి తగ్గ చర్యలు చేయగలిగితేనే రైతులకు నాలుగు పైసలు మిగలటంతో పాటు వాతావరణ కాలుష్యం కూడా కొంతవరకు నివారించవచ్చు.

పుదుచ్చేరికి చెందిన చిన్న వ్యాపారవేత్త 'అబ్దుల్ ఖాదర్' రైతులకి సహాయకారిగా ఉండటానికి, వారు లాభాలను కొంత పెంచుకోవడానికి ఉపయోగపడే 'సౌర శక్తితో పనిచేసే దీపపు ఎర' (సోలార్ లైట్ ట్రాప్) ను రూపొందించాడు. దీని ఖరీదు కూడా తక్కువగా ఉండటంతో (రూ. 2,625/-) తమిళనాడు ప్రాంత రైతులు విరివిగా వాడుతున్నారు.

"మనదేశంలో దీపాలు వాడి పంటల రక్షణకి పురుగులను పట్టుకోవటం అన్నది చాలాకాలం నుంచి ఉన్నదే. దానికై మార్కెట్లో చాలా రకాల సాధనాలు దొరుకుతున్నాయి. కానీ కరెంటు లేదా మరే విధమైన ఇంధనమూ వాడకుండా ఈ పనికి ఒక సాధనాన్ని కనిపెట్టాలన్నదే నా ఆలోచన. అందుకే సౌర శక్తితో పనిచేసే కీటక ఎరని తయారు చేశాను. నేను దీనికి ఎల్.ఇ.డి. టెక్నాలజీ వాడి, సూక్ష్మ నీలి కాంతిని (అల్ట్రా వైలెట్) వెదజల్లే లైట్లను వెలిగించి, పంటలను నాశనం చేసే పురుగులను ఆకర్షించే పరికరాన్ని తయారు చేశాను" అని వివరించాడు అబ్దుల్ ఖాదర్.

"ఈ పరికరంలో అమర్చిన మైక్రో కంట్రోలర్ చిప్ ఆధారంగా సాయంత్రం 6–7 గంటల మధ్య దానంతట అదే పనిచేయటం ప్రారంభించి, 5 గంటల పాటు పనిచేసిన తర్వాత తనంతట తానే ఆగిపోతుందీ పరికరం. పంటలకి హాని చేసే పురుగులు ఈ సమయంలోనే ఎక్కువగా వస్తూవుంటాయి. దీని ప్రత్యేకత ఏమిటంటే ఈ పరికరం కేవలం పంటలకి హాని చేసే కీటకాలను మాత్రమే ఆకర్షిస్తుంది. మిత్ర పురుగులకు హాని చేయదు" అని అంటారు అబ్దుల్ ఖాదర్.

ఒక ఎకరా పొలంలో ఒక పరికరం ఉంచితే రోజుకి కనీసం 10 పెద్ద పురుగులను ఇది ఆకర్షించి నాశనం చేస్తుంది. దీనిని తమిళనాడు రాష్ట్రంలోని చాలా ప్రాంతాలలో వరి, చెఱకు, కూరగాయలు, కాఫీ, టీ, మల్లె తోటలే కాకుండా మామిడి, దానిమ్మ, జామ, దానిమ్మ లాంటి పండ్ల తోటలు, కొబ్బరి తోటల్లో కూడా వాడి పరీక్షించటం

జరిగింది. తమిళనాడు విల్లిపురం జిల్లాలోని 'కిలిమనూరు' గ్రామవాసి సి.యం. పిళ్ళై "నేనీ పరికరాన్ని నా పొలంలో గత రెండు నెలలుగా వాడుతున్నాను. నేను గమనించింది ఏమిటంటే, ఇది తెల్లదోమలు, జిట్టలు, కాండం తొలిచే పురుగులు, ఆకుముడత పురుగులపై చాలా బాగా పనిచేసి వాటిని చాలావరకు నియంత్రించింది" అన్నాడు.

పొలంలో ఎర (దీపపు ఎర, లింగాకర్షక బుట్టలు) లను పెట్టడం వలన రెక్కల పురుగులు, ఆకుముడత పురుగు, కాండం తొలిచే పురుగు, కాయ తొలిచే పురుగు, దోమ, పేనుబంక, తెల్లదోమ, ముక్కు పురుగు, పెంకు పురుగు, రసం పీల్చే పురుగులు మరియు ఈగల ఉధృతిని అరికట్టవచ్చు.

ఆధునీకరించిన సోలార్ ట్రాపర్‌ను శివగంగ జిల్లాలోని 'సెల్వయూర్' గ్రామంలో మూడు నెలల పాటు కాయగూరల పంటలలో వరుసగా వాడి పరీక్షించగా, చాలా బాగా పనిచేసింది. దీనిని వాడటం వలన పెద్దవైన చాలా రకాల రసం పీల్చే పురుగులు, కాండం తొలిచే పురుగులు, ఎగిరే పురుగులు నియంత్రించబడి పంటలలో రసాయన మందుల వాడకం దాదాపు 50 శాతం వరకు తగ్గిపోయింది. ఇది రైతులకి అదనపు లాభం చేకూర్చింది.

"మేము అన్నామలై విశ్వవిద్యాలయం, కోయంబత్తూరు లోని తమిళనాడు విశ్వవిద్యాలయంలో ఈ పరికరాన్ని వరుసగా రెండు పంటల కాలం పరీక్షించి, ఫలితాలు చెప్పమని కోరాము. వారివద్దనుండి ఇంకా మధ్యంతర



నివేదిక రావలసి వుంది" అని చెప్పాడు ఖాదర్.

సాధారణంగా మంటలు వేసి, పంటలను నాశనం చేసే కీటకాలని ఆకర్షించటం అన్నది సాంప్రదాయంగా వస్తున్న పద్ధతి. కానీ, రానురాను ఈ పద్ధతిని మానేసి దాని స్థానంలో శక్తివంతమైన రసాయన మందులు వాడటం మొదలు పెట్టారు. ఇది అంత ఆరోగ్యకరమైన పద్ధతి కాదు. దీనివలన మిత్ర పురుగులు కూడా నశించి పోతున్నాయి.

బెంగుళూరు హెబ్బల్ లోని 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసర్చ్' జోనల్ ప్రాజెక్టు డైరెక్టర్ 'డా. శ్రీనాథ్ దీక్షిత్' గారు సూర్యుడినుంచి వచ్చే శక్తిని వాడటం అన్నది పూర్తిగా పర్యావరణాన్ని రక్షించే పద్ధతి. సౌరశక్తితో దీపాలు వెలిగించి, కీటకాలను నాశనం చేయటం అన్నది చాలా మంచి పద్ధతి. పర్యావరణాన్ని రక్షించే ఈ సోలార్ క్రిమి ట్రాపర్‌కి పెద్దయెత్తున ప్రాచుర్యం కలిగించటం మనందరం చేయవలసిన కనీస బాధ్యత అన్నారు.

ఈ పరికరాన్ని ఎక్కడికైనా సులభంగా తీసుకు వెళ్ళవచ్చు. పైగా ఏవిధమైన ఇతర ఖర్చులూ లేవు. కనుక చాలా సదుపాయంగా ఉంటుంది. పంటలకి హాని చేసే కీటకాలను నియంత్రించటానికి ఇది అనువైన టెక్నాలజీ కనుక ప్రస్తుత రోజుల్లో పర్యావరణ పరిరక్షణకి ఎన్నోవిధాల పాటుపడుతున్న సందర్భంలో దానికి సహాయకారిగా ఉంటూ రైతులకి మేలు చేసే ఈ పరికరానికి ఇప్పుడు చేయవలసిందల్లా దీనిని అమ్మటానికి, అమ్మకం తర్వాత సేవలు అందించటానికి విస్తృతంగా ఏర్పాట్లు చేయటం.

ఇటువంటి చవకైన సోలార్ లైట్ ట్రాప్‌ని రూపొందించిన చిన్న ఇన్నోవేటర్లని, వ్యాపారవేత్తలని ప్రోత్సాహించాల్సిన అవసరం ఎంతైనా వుంది. వ్యవసాయానికి చేయూతనిచ్చే ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరికరాల వ్యాపారంతోపాటు అదనపు ఉద్యోగాలకి కూడా మంచి అవకాశం వుంటుంది. పరికరం పనితీరుని "యూట్యూబ్" https://www. youtube.com/watch?v=znS1i4e0kH0&feature=youtu.beలో చూడవచ్చు. అదనపు సమాచారం కావాలనుకున్న వారు సంప్రదించాల్సిన చిరునామా : అబ్దుల్ ఖాదిర్, సస్టెయినబుల్ ఫార్మింగ్ సిస్టమ్స్, **Ph.: 094885 91915** ఇ-మెయిల్ :safs.orgmm@gmail.com ●

# యువతీ యువకులారా
# మీ ఊర్లోనే మీరు ఓ వ్యాపారవేత్త అయ్యే అవకాశముంది!

**మీ ఊర్లో మీ స్వంత పనులు చూసుకుంటూనే ఓ వ్యాపారవేత్త కావచ్చు! ఆ వ్యాపారంలో మీరు లాభం పొందటమే కాకుండా మీ గ్రామంతో పాటు, చుట్టుప్రక్కల ఊర్లలోని రైతాంగానికి/ సమాజానికి కూడా సహాయం చేసినవాళ్ళవుతారు. మీకీ అవకాశం కల్పించడానికి అందుకు అవసరమైన సహాయ సహకారాలను మీకు అందించటానికి పూనుకున్నది 'పల్లెసృజన'.**

గ్రామీణుల శ్రమను, జ్ఞానాన్ని ఉపయోగించుకొని పట్టణాల్లోని ఎంతోమంది కోట్లకు పడగలెత్తుతున్నారు. ఒక రైతు పండించే పంట అమ్మేటప్పుడు ఒక్క రూపాయి అయితే కొనేటప్పటికి అది 10 రూపాయలుగా మారుతోంది. అంటే ఈ దేశపు దళారీ వ్యవస్థ ఎంతగా వేళ్ళూనుకు పోయిందో అందరికీ తెలిసిందే. దీన్ని ఎవరు రూపు మాపుతారో అని ప్రతి ఒక్కరూ అనుకుంటూనే వుంటారు. సరిగ్గా ఇలాంటి ఆలోచనలోనుంచి 'పల్లెసృజన'కు పుట్టిందే "గ్రామీణ వ్యాపారవేత్త" నినాదం.


గత 9 సంవత్సరాలుగా గ్రామీణుల సృజనాత్మక జ్ఞానాన్ని వెలుగులోకి తీసుకు వచ్చి సమాజానికి పనికి వచ్చే ఎన్నో యంత్రాలను, వస్తువులను, ఆలోచనలను ప్రపంచానికి పరిచయం చేసింది 'పల్లెసృజన'. కానీ మేము వెలుగులోకి తెచ్చిన ఎన్నో ఇన్నోవేషన్లు అనుకున్న విధంగా సమాజానికి ఉపయోగ పడలేక పోతున్నాయి. దానికి ఎన్నో రకాల అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఈ ఇన్నోవేషన్లను సమాజం విరివిగా వినియోగించుకోవాలన్నదే మా సంకల్పం. అందుకే గ్రామీణ ఇన్నోవేషన్లను, గ్రామాల్లోని నిరుద్యోగ యువతీ యువకులే పూనుకుని పెద్దమొత్తంలో తయారు చేసి తిరిగి వాటిని గ్రామాల్లో అవసరమైన వారికి అమ్ముకుని తమకు తాము జీవనోపాధిని పొందటంతో పాటు గ్రామీణ సృజనలకు సముచిత స్థానం ఇవ్వటంతో పాటు, సమాజానికి వెలుగును పంచాలన్నదే మా అభిమతం.

ఇందుకొరకు ప్రతి నెలా 2వ శనివారం, 4వ ఆదివారం నాడు వ్యాపార వేత్తలు కావాలనుకున్న గ్రామీణులకు "శిక్షణా తరగతులు" నిర్వహిస్తున్నది 'పల్లెసృజన'. మీకు ఈ శిక్షణా తరగతుల్లో గ్రామీణ సృజనలు అంటే ఏమిటి? అవి మానవాళికి ఎలా పనికి వస్తాయి? వీటిని ఉపయోగించుకోవటం వల్ల గ్రామీణులు ఎలాంటి లాభాలు పొందుతారు? వీటిని ఎలా తయారు చేయించాలి? వీటిని తయారు చేయించి వ్యాపారం చేయటం వల్ల మీకు వచ్చే లాభాలు ఏపాటివి? లాంటి ఎన్నో రకాల అంశాలపై మా నిపుణులు ఒక రోజంతా వివరించి, మీరు వ్యాపారవేత్త కావటానికి తగిన సహాయ సహకారాలు 'పల్లెసృజన' ద్వారా ఎలా పొందుతారో వివరించి మిమ్మల్ని ఔత్సాహిక వ్యాపార వేత్తగా తయారు చేస్తారు.

ఉత్సాహమున్న గ్రామీణ యువత ఈ సదవకాశాన్ని వినియోగించుకొని జీవితంలో ఎంతో ఎత్తుకు ఎదగాలని కోరుకుంటోంది 'పల్లెసృజన'. ఇందుకు నాందిగా మొదటి శిక్షణా తరగతులు '2015 మార్చి, 14'న నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణా తరగతులకు రావాలనుకున్న వారు 4 రోజులు ముందుగా కార్యాలయానికి ఫోన్ చేసి మీ పేరు, చిరునామా, ఫోన్ నెంబరు నమోదు చేసుకోగలరు.

శిక్షణ కార్యక్రమంలో పల్లెసృజన మీకు భోజన వసతి, సదుపాయాలు కల్పిస్తుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనటానికి ఎంట్రీ ఫీజు కేవలం రూ. 100/–లు మాత్రమే.

ఇక ఆలస్యమెందుకు మీ గ్రామంలోనే మీరో వ్యాపార వేత్తగా మారటంతో పాటు ముందుగా పదిమందికి వెలుగునిచ్చిన వారు అవ్వాలంటే వెంటనే మీ పేర్లు నమోదు చేసుకుని ముందు వరుసలో ఉండండి.




పూర్తి వివరాలకు సంప్రదించండి :

'పల్లెసృజన'

నెం. 67, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ – 500 094.

**Phone : 040-27111959**

E-mail : honeybeeap@gmail.com

www.pallesrujana.org

# రైతులకొరకు రైతులు తయారు చేసిన అద్భుత యాంత్రిక ఆవిష్కరణలు

**7 నుంచి 13 మార్చి, 2014 లలో భారత రాష్ట్రపతి భవనంలో జరిగిన ఇన్నోవేషన్ ఎగ్జిబిషన్‌లో వీటిని ప్రదర్శించారు) వీటిని చూసి కావాల్సిన వారు తగ్గ మార్పులు చేర్పులు చేసుకొని తమ అవసరానికి అనుగుణంగా మార్చుకోవచ్చు. కాకపోతే అసలు తయారీదారుని వద్దనుండి లిఖితపూర్వకమైన అనుమతి తీసుకోవాల్సి వుంటుంది.**



గుజరాత్ లోని అమరెలికి చెందిన మన్సుఖ్‌భాయ్ జగాని బుల్లెట్ శాంతి రూపకర్తగా పల్లెసృజన పాఠకులకు పరిచితమే. ఈయనకు యంత్రం సామర్థ్యం ఏమిటి, దానిని ఎలా వాడితే ఇంకా బాగా ఉపయోగ పడుతుందన్న విషయం బాగా తెలుసు. ఎడ్లను వాడి దున్నేకన్నా ఇవి చాలా రెట్లు సమర్థవంతంగా పనిచేస్తున్నాయి. ప్రత్యేకించి పత్తి సాగులో ట్రాక్టర్లకన్నా ఇదే బాగా పనిచేస్తుందని నిరూపించబడింది. ఇటువంటివే కెన్యా దేశంలో కూడా పరీక్షించగా వారిఉత్పత్తి ఎన్నోరెట్లు అధికంగా వచ్చింది. దీనికి అవసరాన్ని బట్టి తగిన పనిముట్లను కూడా అమర్చుకోవచ్చు.

గుజరాత్ రాష్ట్రం, భావ్‌నగర్ జిల్లా ధారేడ్ గ్రామానికి చెందిన "ఈశ్వర్ భాయ్ బ్రిజ్‌లాల్ సిధ్‌పార" రూపొందించిన ఈ ప్రత్యేకమైన ట్రాక్టరు భూమినుండి దాదాపు 7 అడుగుల ఎత్తులో వుండి, ఎత్తుగా పెరిగిన ప్రత్తి మొక్కలపై మందును స్ప్రే చేయటానికి అనువుగా వుంటుంది. దీన్ని ఉపయోగించి స్ప్రే చేయటం వలన మనుషులకు క్రిమి సంహార మందును తాకవలసిన అవసరమే రాదు కనుక ఏవిధమైన హాని వుండదు. ఎత్తు ఎక్కువగా ఉండటంతో ట్రాక్టరుకు మూడు చక్రాలకన్నా 4 చక్రాలు ఉంటే బ్యాలెన్స్ బాగుంటుందని ఇలా తయారు చేశాడు.





గుజరాత్‌లోని అమరేలి జిల్లా, చిత్తాల్ గ్రామానికి చెందిన "రసిక్ భాయ్ రాథోడ్" రూపొందించిన ఈ మోటార్ సైకిల్ ట్రాక్టర్‌లో చైన్ స్ప్రాకెట్‌ను మూసి వుంచటం వలన దుమ్ము ధూళి నుండి రక్షణ లభిస్తుంది. దీని ఛాసిస్‌ను సరిగ్గా టెంప్‌లెట్‌మీద కూర్చునేలా నిర్మించాడు కనుక ఏ యంత్రానికైనా ఇది అనువుగా వుంటుంది. మిగతా మాడల్‌లతో పోలిస్తే దీనిలో కుదుపులు తక్కువ. ఇంధనం కూడా తక్కువగా వినియోగించుకుంటుంది.



గుజరాత్ లోని అమరెలి జిల్లాలోనే లిలియా గ్రామానికి చెందిన 'శైలేష్‌భాయ్ దోడియా' రూపొందించిన ఈ మోటార్ సైకిల్‌లో ఇంజను నేరుగా గేరు బాక్స్‌తో అనుసంధానం చేయటం వలన ఎక్కువ శక్తి ఉత్పత్తి అవటమే కాక, గేరుమార్చటానికి సీటు ముందు ఏర్పాటు చేయటం వలన దీన్ని నడపడం చాలా సులువుగా వుంటుంది. ఇది కూడా తక్కువ ఇంధనాన్ని వినియోగించు కుంటుంది.



గుజరాత్ రాష్ట్రం, జామ్‌నగర్ జిల్లా, హరిపూర్ గ్రామవాసి "రానమ్ భాయ్ జమాల్‌భాయ్ ఫర్మార్" రూపొందించిన ఈ మినీ ట్రాక్టర్ ఇతర ట్రాక్టర్లతో పోలిస్తే ఇంధనం చాలా తక్కువగా వినియోగిస్తుంది. భూమినుంచి ఎత్తుగా ఉండటమే కాక, ఏవిధమైన మార్పులూ చేయనవసరం లేకుండానే చిన్న చిన్న పరికరాలు దీనికి అమర్చుకోవచ్చు.



గుజరాత్ రాష్ట్రం, భావ్‌నగర్ జిల్లా, తింబి గ్రామవాసి "హస్ముఖ్‌భాయ్ రామ్‌చోడ్‌భాయ్ చౌహాన్" రూపొందించిన ఈ మినీ ట్రాక్టర్ తక్కువ ప్రదేశంలోనే వెనక్కి తిరుగ గలదు. వదులైనప్పుడు చైన్ స్ప్రాకెట్‌ను బిగుతుగా చేసుకునే సదుపాయం దీని చాసిస్‌లో వుంది. చాలామంది టెలిస్కోపిక్ సస్పెన్షన్ సిస్టంను వాడగా దీనిలో స్ప్రింగ్ సస్పెన్సన్ సిస్టం వాడటం వలన ఎగుడు దిగుడు పొలాల్లో పనిచేయటానికి అనువుగా వుంటుంది.

**ఇక్కడ ఉదహరించిన మోటార్ సైకిల్ ఆధారిత ట్రాక్టర్లన్నీ కూడా మొట్టమొదట మన్సుఖ్‌భాయ్ జగాని తయారు చేసిన "బుల్లెట్ శాంతి" ప్రేరణతో ఆయా ప్రాంతాల రైతులు వారివారి అవసరాలను అనుకూలంగా తామే స్వయంగా తయారు చేసుకున్నవి. ప్రస్తుతం వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకోవాలంటే ఖర్చులు తగ్గించుకోవటానికి ట్రాక్టర్ల బదులు ఇటువంటి పరికరాలను రైతులు తామే స్వయంగా తయారు చేసుకుని, తమ వ్యవసాయమే కాకుండా ఇతర రైతులకు కూడా సహాయం చేయవచ్చు. ఔత్సాహికులైన రైతులు ఎవరైనా ముందుకు వచ్చి ఏదైనా ఇటువంటి ట్రాక్టర్ తయారు చేసుకుంటే మాకు తెలియజేయటం మరువకండి.**

**కానీ ఇక్కడొక చిన్న సమస్య ఎదురవుతోంది. ఈ మార్పు చేసిన వాహనాలు రోడ్డుమీదకు రావాలంటే ప్రత్యేక లైసెన్సు అవసరం అవుతోంది. ఆహార భద్రత అని, ఉచిత ఆహార పంపిణీ అని, తక్కువ ఖర్చుకే ఆహారమని, తక్కువ ఖర్చుకే రేషన్ బియ్యమని..... ఇలా ఎన్నో రకాల పథకాలను ప్రవేశ పెడుతున్న ప్రభుత్వాలు ఆ ఆహార దాన్యాలను పండించటానికి కారకుడైన రైతుకి ఇటువంటి వాహనాలు రూపొందించుకోవటానికి, నడుపుకోవటానికి, వాడుకోవటానికి ప్రతిబంధకంగా వున్న నిబంధనలను సులభతరం చేస్తే ఇటు రైతుకి మేలు చేసినవారే కాక, అటు ప్రజా శ్రేయస్సుకై వారు ప్రవేశ పెట్టిన, పెట్టదలుచుకున్న అనేక రైతు సంబంధ పథకాలకి కూడా మేలు చేసినవారు అవుతారు. దీనికై అందరూ కృషి చేయాలి.**

# ఈ అమ్మమ్మమ్మ

## 115 సంవత్సరాల్లో కేవలం 200 కి.మీ. మాత్రమే ప్రయాణం చేసిందట



గుజరాత్ రాష్ట్రంలోని 'భావ్‌నగర్' జిల్లా, 'తిమానా' గ్రామ నివాసి 'ముదీబేన్ పాండ్యా'కి 115 సంవత్సరాలు! రెండు మాటల్లో ఆవిడ జీవితం గురించి చెప్పాలంటే సాధారణ జీవితం గడపటం, కష్టానికి ఎదురీదటం.... ఇదే ఆమె చేసింది. ఆమె మొఖంపై వున్న ముడతలను, బలహీనంగా వున్న శరీరం చూసి మోసపోకండి... ఈ అమ్మమ్మల అమ్మ ఇప్పటికీ తనపని తానే స్వంతంగా చేసుకోగలదు తెలుసా!! ఆమె మా ప్రశ్నలకి ఎంత చురుగ్గా సమాధానాలు చెప్పిందో తలుచుకుంటే మాకే ఆశ్చర్యంగా ఉంది. వయస్సుతో పాటు చూపు కొంచెం తగ్గిందంతే. ఈమధ్య ఏమీ గుర్తుండటం లేదర్రా అని అన్నా, ఆమె గ్రాహణ శక్తికి, తర్కానికి తిరుగు లేదనిపించింది.

పుట్టినప్పటినుంచి పొలంలో లేదా ఇంట్లోనో పని చేస్తూనే వుంది. ఆమెకి 12వ యేటనే వివాహం అయింది. కానీ, దురదృష్టం ఆమె అత్తారింట కాలు పెట్టకముందే భర్తను కోల్పోయింది. దెబ్బమీద దెబ్బా అన్నట్లు ఆమెకి 16 సంవత్సరాలు వచ్చేసరికి తల్లిని కూడా కోల్పోయింది. అప్పటినుంచి ఇంట్లో పెద్దపిల్లగా నలుగురు తమ్ముళ్ళు, ముగ్గురు చెల్లెళ్లకి తానే తల్లయి పెంచి, పెద్ద చేసింది.

ఆమె తండ్రికి వున్న 100 భీగాల పొలంలో వ్యవసాయం చేసేవారు. తండ్రికి పొలం పనుల్లో సహాయం చేస్తూనే ఇంట్లో తమ్ముళ్ళ, చెల్లెళ్ళ ఆలనా పాలనా చూసుకుంటూ వుండేది. చెయ్యాలికదా, పెద్దకూతుర్ని మరి అన్నదామె. ఇప్పటికీ ఆమె తన తండ్రి ఇంట్లో సోదరుడు హర్‌గోవింద్‌భాయ్ కుటుంబంతో కలిసి వుంటోంది. తమ్ముడి కొడుకు లిద్దరూ మిలట్రీలో చేరిపోయారు. వాళ్ళిద్దరూ తెగ గుర్తుకొస్తారు అని చెప్పిందావిడ. ప్రయాణాలా... నేనా... ఎందుకు చెయ్యలేదు మా నాన్నగారి దినాలు చేయడానికి 'జునాగడ్' వరకూ వెళ్ళాను తెల్సా అన్నదామె.

ఏమోనర్రా, మా కాలంలో జీవితం ఎంతో సుఖంగా ఉండేది. ఏమీ లేకపోయినా, సాదా సీదాగా వున్నా ఆ రోజులే బావున్నాయనిపిస్తోంది అంటారామె. మా కాలంలో ఏం తినేవాళ్ళమా? ఎంచక్కా జొన్న రొట్టలు, ఉలవలు, రాజ్మా, చిక్కుడు గింజలు, కందులతో చేసిన కూరలు, ఉప్పుడు బియ్యం తినేవాళ్ళం. మీకు తెలుసా చిన్నప్పుడు మర్రిచెట్టు పండ్లు తెగ తినేవాళ్ళం. ఎంత బాగా వుండేవో అని గుర్తు చేసుకుందామె. ఆమె ప్రస్తుతం సజ్జరొట్టె, గోధుమ అన్నం, పాలు తీసుకుంటోంది. నేను టీ తాగటం ఈమధ్యనే మొదలు పెట్టాను ఒక ఇరవై సంవత్సరాలు అయివుంటుంది. అంతకు ముందెప్పుడూ టీ తాగి ఎరగను అన్నదామె. ఇప్పటికీ ఎప్పుడన్నా జొన్నరొట్టెలు తినాలనిపిస్తుంది.... తినగలవా అంటే నా పళ్ళకేం నిక్షేపంలా ఉన్నాయి. నేను చిన్నప్పటినుంచి వేప, నల్లతుమ్మ, కానుగ పుల్లలతో పళ్ళు తోముకునేదాన్ని. ఇప్పటికీ అంతే నా పళ్ళు గట్టిగానే ఉన్నాయి తెలుసా అన్నదామె. ఇప్పుడు రకరకాల సబ్బులు, శాంపూలు వచ్చాయి కానీ, నా చిన్నతనంలో తల స్నానం చెయ్యాలి అంటే పుట్టమన్ను (పాము పుట్టలట), వాడేవాళ్ళం అని చెప్పింది.

"మా కాలంలో ఏంటీ ఇప్పటికైనా సరే తలనెప్పి

వస్తే ఒక గుడ్డముక్కని ఉప్పునీటితో తడిపి నుదుటిపై పట్టి వేస్తే సరి తలనొప్పి ఇట్టే పోతుంది" అని చిట్కా చెప్పిందావిడ. సెగ గడ్డలు (దిమ్మడ) వస్తే చదరపు పెంకులని పొడి చేసి, కట్టు కడితే తగ్గిపోతాయట. మా కాలంలో గాలి చల్లగా ప్రశాంతంగా ఉండేది. ఇంత దుమ్ము, ధూళి ఉండేవి కావు. అందుకేనేమో నాకు దగ్గు, జలుబు, తలనొప్పి వస్తున్నాయి. మరి వాటికి మీరేం మందులు వాడుతారని అడిగితే అయినా నేను నా పాతకాలం మందులనే వాడుతాను తెలుసా అని నవ్వారామె. ఇప్పుడు పొలాల్లో రకరకాల మందులు వాడుతున్నారు, అందుకే వేడి ఎక్కువై పోయింది. బహుశా అందుకేనేమో ఇప్పుడు జింకలు, దుప్పులు, నీల్గాయ్‌లు, నక్కలు చాలా తక్కువగా కన్పిస్తున్నాయి అని చెప్పిందావిడ.

పండగలంటారా మా కాలంలో దీపావళి అంటే ఇంటిముందు రెండు ప్రమిదలలో దీపాలు పెట్టడం. లాప్సీ, సుర్కు, ఘరీస్ లాంటి పిండివంటలు చేసుకుని తినేవాళ్ళం. ఇప్పట్లా ధమా ధమా చప్పుళ్ళు ఉండేవి కావు అన్నదామె. నవరాత్రి వచ్చిందంటే చాలు రాత్రంతా గర్బా నృత్యం చేసేవాళ్ళం. ఆ సందడే వేరు అందామె.

ఇప్పటి ధరల గురించి మీకేం చెప్పను బాబూ మా కాలం గురించి మీకు తెలియదు కనుక చెప్తా. అరకిలో స్వచ్ఛమైన నెయ్యి 7 అణాలకు దొరికేది. 5 గ్రా. బంగారం 6 రూపాయలుండేది. ఇప్పుడు నెయ్యే బంగారమైపోయింది. మా చిన్నతనంలో రాణి బొమ్మతో నాణేలుండేవి. ముదియా, చౌతాళియా అనేవాళ్ళం అని పాత రోజుల్ని గుర్తుకు తెచ్చుకుందావిడ.

ఎక్కువ కాలం బ్రతకటం ముఖ్యం కాదు, బ్రతికినంత కాలం దేవున్ని నమ్ముకోవాలి. మనస్ఫూర్తిగా కొలవాలి. అయినా నేనొచ్చిన పనైపోయింది ఇంకెప్పుడు పిలుపు వస్తే అప్పుడు వెళ్ళిపోవాలి అంటూ అదుగో వంటకి పిలుపొచ్చింది వెళ్ళాలి అంటూ వెళ్ళిపోయింది. ●

## శతమానం భవతి

### (వృద్ధుల జ్ఞానం 100 గ్రంథాలయాలతో సమానం)

తాతయ్య, అమ్మమ్మ, నానమ్మల నుండి జ్ఞానానికి సంబంధించిన కబుర్లు మీరు వినడానికి ఎప్పుడైనా ప్రయత్నించారా? ఏకాగ్రతతో రెండు గంటలు వారితో గడపండి. వారి అనుభవాల పొరల్లో ఎంతో జ్ఞానం దాగివుంటుంది. ఆ కబుర్లను మాకు వ్రాసి పంపండి. ప్రచురణకు అనువైన వాటిని 'పల్లెసృజన'లో ప్రచురిస్తాం. వ్యాసాలను పంపేటప్పుడు మీ ఫొటోతో పాటు, మీకు కబుర్లు చెప్పిన వారి ఫొటోలను కూడా తప్పక పంపండి. ఈ అపూర్వ సాంప్రదాయ జ్ఞానాన్ని వెలుగులోకి తీసుకువచ్చి, భావి తరాలకు అందజేయటానికి మీ సహకారాన్ని కోరుతున్నాము. -ఎడిటర్.

## NIF లో మీకు అవసరమైన ఇన్నోవేషన్‌ల అన్వేషణ

నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ గత 14 యేళ్ళుగా సేకరించిన గ్రామీణ ఇన్నోవేషన్లు, సాంప్రదాయ జ్ఞానం ప్రజలందరికీ అందుబాటులో వుండటానికై ఒక వెబ్‌సైట్ తయారు చేసింది. ఈ జ్ఞానమంతా వెబ్‌సైట్ www.nifindia. org లో చూడవచ్చు. అలాగే మీకు ఏ సమస్యకైనా పరిష్కారం ఈ జ్ఞానం కోశంలో వుందో లేదో తెలుసుకోవాలనుకుంటే

### NIF టోల్ ఫ్రీ నెంబర్ 1800 233 5555

కు కూడా ఫోన్ చేసి తెలుసుకోవచ్చు. కానీ ఫోన్‌లో మాట్లాడాలనుకునేవారు ఇంగ్లీషు లేదా హిందీలో మాత్రమే సంప్రదించవలసి వుంటుంది.

**సాంప్రదాయ జ్ఞానం ఆధునిక విజ్ఞానం కలిసి వుండటం సాధ్యమేనా?**



# ఇగ్నైట్-14 విజేతలు

పిల్లలలో ప్రత్యేకించి బడి పిల్లలలోని సృజనాత్మకత, ఇన్నోవేటివ్ స్ఫూర్తిని కలిగించటం కోసం జాతీయ స్థాయిలో జరిగే పోటీయే 'ఇగ్నైట్'. పిల్లలు తమ స్వంత సాంకేతిక ఆలోచనలని, ఇన్నోవేషన్లని 'ఇగ్నైట్' కి పంపాలని కోరటం జరుగుతుంది.

సెప్టెంబర్ 1, 2013 నుండి ఆగష్టు 31, 2014 వరకు జరిగిన 'ఇగ్నైట్-14' జాతీయ స్థాయి పోటీలకు దేశంలోని 35 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలోని 359 జిల్లాలోనుండి 27,123 మంది పిల్లలు పాల్గొన్నారు. 'ఇన్నోవేషన్ రోజు' గా జరిగే డా. ఎ.పి.జె. అబ్దుల్ కలాం గారి పుట్టిన రోజైన అక్టోబర్ 15న ఎన్.ఐ.ఎఫ్. ఈ పోటీల బహుమతులు ప్రకటించారు. ఐ.ఐ.ఎం. అహమ్మదాబాద్ లో నవంబర్ 19, 2014న అబ్దుల్ కలాంగారి చేతుల మీదుగా గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం జరిగింది. విజేతలు, వారి ఇన్నోవేషన్లను గతసంచిక తర్వాయి భాగం మీకందిస్తున్నాం

**తిరిగే ట్రేలతో డ్రమ్ములా ఉండే రిఫ్రిజిరేటర్ :**
**శరత్ శుక్లా, 8వ తరగతి, ఇందిరాపురం పబ్లిక్ స్కూల్, ఘజియాబాద్, ఉత్తర ప్రదేశ్.**

రెఫ్రిజిరేటర్లో పెట్టిన సామాన్లు తీయాలంటే మనకు కావలసిన పదార్థం వెనకవైపు వుంటే ముందుగా ముందువైపున్న సామాన్లు తీసి పక్కన పెట్టి, మనకి కావలసినది తీసుకున్న తర్వాత తిరిగి అన్నీ సర్ది పెట్టాల్సి వుంటుంది. ఈ ఇబ్బందిని తొలగించటం కోసం శుక్లా "తిరిగే ట్రేలతో వృత్తాకారంలో డ్రమ్ములా వుండే రిఫ్రిజిరేటరు ఉంటే బావుండు"నన్న ఆలోచన చేశాడు. ట్రేను తిప్పటం ద్వారా మనకు కావలసిన పదార్థాన్ని సులభంగా తీసుకునే వీలుంటుంది.



చదువుతో పాటు శుక్లాకి పుస్తకాలు చదవటం, ఫుట్‌బాల్, బాడ్మింటన్ ఆడటం, వ్యాసరచన, వక్తృత్వపు పోటీల్లో పాల్గొనటం అంటే సరదా. దేశ రక్షణ విషయాలలో పరిశోధనలు చేసే శాస్త్రవేత్త అవ్వాలని ఇతని కోరిక.





**వ్యవసాయదారుల మేధోసంపత్తి హక్కులు కాపాడటానికి మీరు సిద్ధమేనా?**

**వివిధ రకాల సైజుల పిన్నులకి పనికి వచ్చే ఒకేవొక స్టేపిలర్ :**

**జి. వాసంత్, డి. కీర్తి వాసంత్, 9వ తరగతి, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, తిరువరూర్, తమిళనాడు.**

వీరి ఆలోచన ప్రకారం వివిధ రకాల సైజుల పిన్నులకు ఒకే స్టాప్లర్ ఉంటే వీలుగా వుంటుంది. రకరకాల పిన్నులకి వేరువేరు స్లాప్లర్లు కొని వాడాల్సిన అవసరం ఉండదు.

వాసంత్‌కి తోట పనులు చేయటం, మోటార్లు, డైనమోల గురించి తెలుసుకోవటంలో ఆసక్తి ఎక్కువ. అతని మిత్రుడు కీర్తి వాసంత్‌కి బొమ్మలు గీయటం, రంగులు వేయటం అంటే ఇష్టం. వాసంత్‌కి ఇంజనీర్ అవ్వాలని, కీర్తి వాసంత్‌కి మంచి చిత్రకారుడు అవ్వాలని కోరిక.






**రీచార్జబుల్ బ్యాటరీలతో పోర్టబుల్ వై-ఫై డాంగిల్ :**

**హ్రిషిత్ షా, 9వ తరగతి, నవరచనా పాఠశాల, వడోదర, గుజరాత్.**

సాధారణంగా వై-ఫై డాంగిల్ లను రీచార్జ్ చేయాలంటే ల్యాప్‌టాప్‌ల నుంచిగాని, లేదా కరెంటు ప్లగ్ నుంచిగాని చేసుకోవాల్సి వుంటుంది. ఇతని ఆలోచన ప్రకారం రీచార్జ్ చేయబడిన బ్యాటరీల సహాయంతో వై-ఫై డాంగిల్‌ను చార్జి చేసుకుని ఏ ప్రదేశంలోనైనా వై-ఫై క్షేత్రాన్ని ఏర్పాటు చేసుకునే వీలుండాలి.



తాను చదువుకునేటపుడు ల్యాప్‌టాప్ వై-ఫై ద్వారా ఇంటర్నెట్ వాడటంలో వచ్చిన ఇబ్బంది రావటంలో ఇతనికి ఈ ఆలోచన వచ్చింది. తనకి క్రికెట్ ఆడటం అంటే ఇష్టమని, పెద్దయ్యాక ఏం చేయాలో నిర్ణయించుకోలేదని అంటాడితను. ప్రస్తుతం ఏమీ చేయకుండా ఇతరుల జీవితాన్ని ఏవిధంగా సులభతరం చేయాలని ఆలోచిస్తూ వుంటాను అంటాడు.



**మీ పిల్లల ప్రశ్నలకి సమాధానం తెలియదు అని మీరు చివరిసారిగా ఎప్పుడు ఒప్పుకున్నారు?**

**ఏ ఎత్తులోనైనా వాడుకునేందుకు వీలుగా వాష్‌బేసిన్ :**

**ఆక్షాంషా గుహ, 10వ తరగతి, ఆర్మీ పబ్లిక్ స్కూల్, పౌరీ ఘర్వాల్, ఉత్తరాఖండ్.**

అక్షాంషా తండ్రి పొడవైన వ్యక్తి. ఆయనకి వెన్ను నొప్పి వచ్చినపుడు వాష్ బేసిన్ వాడే సమయంలో చాలా వంగాల్సి రావటం గమనించినపుడు ఈమెకి ఈ ఆలోచన వచ్చింది. వాష్ బేసిన్, అద్దము, క్రింద డ్రైనేజిపైపు కలిపి మొత్తం మనకి కావలసిన ఎత్తుకి మార్చుకునేలా వుంటే బావుంటుందని ఆమె ఆలోచన. తాను చిన్నగా వున్నపుడు వాష్ బేసిన్ అందుకోవడంలో పడిన ఇబ్బంది గుర్తుకు వచ్చింది. అందుకే ఈ ఆలోచన చేసింది.

ఈమెకి కల్పిత కథలు, సాహస గాథలు, రహస్య ఛ్ఛేదన కథలు చదవటం ఇష్టం. సింథసైజర్ పైన సంగీత సాధన చేయటం, కాగితాలతో బొమ్మలు చేయటం ఈమెకు ఆనందం. పెద్దయ్యాక కంప్యూటర్ సైంటిస్ట్ అవ్వాలనుకుంటోంది అక్షాంషా.






**చెత్త ఊడ్చే యంత్రం :**

**దిప్తాంషు మాలవ్య, ముకుల్ మాలవ్య, 9-12 వ తరగతి, సెయింట్ పాల్ సీనియర్ సెకండరీ స్కూల్, షిరోహి, రాజస్థాన్.**

ఈ ఇద్దరు సోదరులు బస్ స్టేషన్‌లో చెత్త ఊడ్చే వ్యక్తి  చెత్తను ఊడ్చి ప్రతిసారి దాన్ని ఎత్తి డబ్బాలో వేయటానికి ఎంత శ్రమ పడుతున్నాడో గమనించినపుడు వీరికి ఈ ఆలోచన వచ్చింది. కరెంటు మోటర్‌తో పనిచేసే ఒక చెత్త ఊడ్చి తనంతట తానే డబ్బాలో వేసుకునేందుకు వీలుగా ఒక యంత్రం ఉంటే బావుండునని అనుకున్నారు.

శాస్త్ర విషయాలపై ఇద్దరు సోదరులకి మక్కువ ఎక్కువ. ఇద్దరూ కలిసి అనేక సైన్స్ పోటీలు, ప్రదర్శనలలో పాల్గొన్నారు. దిప్తాంషుకి శాస్త్రవేత్తల జీవిత కథలను చదవటం ఇష్టం. పెద్దయ్యాక ఇతను ఇస్రోలో శాస్త్రవేత్తగా చేరాలనుకుంటున్నాడు. ముకుల్‌కి ఇదే రకమైన అలవాట్లుండి ఇంజనీర్ అవ్వాలి అనుకుంటున్నాడు.



**మీరు పునాది స్థాయి ఇన్నోవేటర్ల జ్ఞానాన్ని ఒక పదిమంది స్నేహితులతో ఎపుడైనా పంచుకున్నారా?**




**రహదారి కూడలిలో ట్రాఫిక్ జామ్‌లను తెలియజేయటానికి నాలుగో నీలం రంగు బల్బు:**

**ఆదర్ష్ బర్న్‌వాల్, 10వ తరగతి, రామక్రిష్ణ మిషన్ విద్యామందిర్, కతిహార్, బీహార్.**

ఆదర్ష్ ఒకసారి పాఠశాలనుంచి ఇంటికి వస్తూవుండగా ట్రాఫిక్ జాంలో ఇరుక్కొని ఇంటికి రావటానికి చాలా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అప్పుడతనికి ఈ ఆలోచన వచ్చింది. రహదారులపై ట్రాఫిక్ జామ్ ఏర్పడినప్పుడు ముందు కూడలి వారికి ఎదర ట్రాఫిక్ జాం ఉందని తెలియజేయటానికి కూడళ్లలో వున్న మూడు రంగు లైట్లతో పాటు నాలుగవ నీలిరంగు లైటు ఏర్పాటు చేస్తే వాహనదారులు వేరే మార్గాలలో వెళ్ళి ట్రాఫిక్ బారిన పడకుండా ఉంటారు.

ఆదర్ష్‌కి టీవీ చూడటం, పుస్తకాలు చదవటం, క్రికెట్ ఆడటం అంటే ఇష్టం. పెద్దయ్యాక ఐ.ఎ.ఎస్. ఆఫీసర్ కావాలని ఇతని కోరిక.





**ఆరోగ్యాన్ని పెంపొందించే బట్టల హ్యాంగర్ :**

**కె.బి.ఎస్. సుకేష్, 10వ తరగతి, సెయింట్ మేరీస్ హైస్కూల్, నెల్లూరు, ఆంధ్రప్రదేశ్.** మరియు **రజత్ గౌతమ్, 12వ తరగతి, బక్షీస్ స్ప్రింగ్ డాలెస్ సెకండరీ పాఠశాల, కోట, రాజస్థాన్.**

ఆరేసిన బట్టలు ఎప్పుడూ శుభ్రంగా ఆరోగ్యకరంగా ఉండాలంటే వాటిని అతి నీల కిరణాలు లేదా ఇంకేదైనా క్రిమి సంహారక కిరణాలకు గురి చేస్తే మంచిదని సుకేష్ భావన. సుకేష్ ఒకసారి ఆసుపత్రికి వెళ్ళినపుడు క్రిమిరహిత బట్టల ప్రాముఖ్యత గుర్తించినపుడు ఈ ఆలోచన వచ్చింది. ఇతనికి పుస్తకాలు చదవటం, క్రికెట్ ఆడటం ఇష్టం. శాస్త్ర సంబంధ పుస్తకాలు చదవటం, విషయాలు తెలుసుకోవటంపై ఆసక్తి ఎక్కువ. పాటలు వినటం, ఇంటర్నెట్ చూడటంలో ఎక్కువ సమయం కేటాయిస్తుంటాడు. పెద్దయ్యాక వ్యవసాయ శాస్త్రవేత్త అయి సేంద్రియ పద్ధతిలో కొత్త మొక్కల రకాలు సృష్టించాలని ఈయన కోరిక.



**స్కూలు, కాలేజి విద్యార్థులకు గ్రామీణ జ్ఞానం గురించి అవగతం చేయండి.**
**వారిని గ్రామ సమస్యలకు పరిష్కారాలను వెతకటంలో భాగస్వాములను చేయండి.**



## ధైర్యం, సృజనాత్మకత, దయాగుణాల మేలు కలయిక

హర్యానా రాష్ట్రంలోని 'మహేంద్రగర్' జిల్లాలో 24 -31 మే, 2014 వరకు జరిగిన

# 33వ జాతీయ స్థాయి శోధయాత్ర

2వ భాగము

(గత సంచిక తరువాయి)

దారిన పోయే ప్రయాణీకులకి త్రాగడానికి మంచినీరు అందించే చక్కని సంస్కృతి, సమర యోధులకి గౌరవ సూచకంగా స్థూపాలు కట్టడం, సేంద్రియ వ్యవసాయం చేసే రైతులతో మా సంభాషణ, చిన్నపిల్లల సృజనాత్మకత - ఆలోచనలు ..... ఇవన్నీ నెమరు వేసుకుంటూ 'రాంబస్ గ్రామం' నుంచి నడుస్తూ 'ధానా' గ్రామం చేరుకున్నాం. అక్కడికి చేరుకోగానే స్థానికులు మాకు 'రాబ్డీ' పానీయం ఇచ్చారు. స్థానికంగా తయారు చేసే ఈ పానీయం తాగితే అలసట పోవటమే కాకుండా ఎండసొర కొట్టదట. చాలా బావుందా పానీయం. అక్కడ ధర్మవీర్ కాంభోజ్ రూపొందించిన 'ఫుడ్ ప్రాసెసింగ్ యంత్రం' గురించి వివరించాం. దీనిని ఉపయోగించటం వలన ఇన్ని ఆర్థిక లాభాలున్నాయా అని వాళ్లలో వాళ్ళు చర్చించు కున్నారు. చివరికి ఆ గ్రామం నుంచి కొందరు యువకులని ధర్మవీర్ దగ్గరికి శిక్షణకై పంపటానికి నిర్ణయించుకున్నారు.

అక్కడినుంచి 'మహుదీ' గ్రామం వెళుతూ వుండగా తోవలో ఒక రైతు మోటార్ సైకిల్ నడుపుతూ తన పొలంపై దాడిచేసిన 'నీల్గాయ్' జంతువులను పారతోలటానికి ప్రయత్నిస్తూ వుండటం చూశాం. మేము అతనికి జంతువుల నుండి పొలాలను ఏవిధంగా రక్షించుకోవాలి? అని హనీబీ రూపొందించిన పుస్తకం ఇచ్చి, వివరించి ఆవిధంగా చేయమని ముందుకు సాగాము. భారత రాష్ట్రపతిచేత పరిశుభ్ర గ్రామంగా బహుమతినందుకున్న 'గొమిలియా' గ్రామం చేరుకున్నాం. అక్కడ ఒక ఉద్యాన వనంలో కూర్చొని (గ్రామంలో ఉద్యాన వనమా? అని ఆశ్చర్యపోకండి) పిల్లలతో కొత్త ఆలచనల గురించి చర్చించాం. రవికాంత్ శర్మ అనే 6వ తరగతి చదువుతున్న విద్యార్థి మనం టేప్ రికార్డర్‌లో మాట్లాడిన తర్వాత కొద్ది నిమిషాలలోనే మనం మాట్లాడేది కాగితం మీద టైప్ అయి వస్తే బావుంటుంది కదా అన్న ఆలోచన చెప్పాడు. ఆ దిశలో ప్రయత్నాలు జరుగుతున్నాయి అని అతనికి చెప్పాము. అతనే సౌరశక్తితో పనిచేసే ఇస్త్రీపెట్టె ఉంటే బావుండును అన్నాడు. నిజమేననిపించింది. అక్కడినుంచి తిరిగి వస్తుండగా ఆ గ్రామానికి గతంలో సర్పంచిగా పనిచేసిన వ్యక్తి తారసపడి గ్రామంలో మురుగునీటికై పైపులు ఏవిధంగా వేశారో, మంచి పక్కారోడ్లు వేయించిన వైనం, పిల్లలు ఆడుకోవటానికి ఉద్యాన వనాలు ఏర్పాటు చేసిన తీరు వివరించారు. అతడిని అభినందించి మీరందరూ కలిసి పనిచేయటం వలననే మీ గ్రామానికి ఉత్తమ గ్రామం పురస్కారం వచ్చిందని, అందరూ కలిసి పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయి అని చెప్పి ముందుకు




సాగాము.

అక్కడినుంచి యాత్రీకుల బృందం 'మోహ్‌దులా' గ్రామానికి వెళుతూ వుండగా పొలం మధ్యలో చెట్లు చాలా ఎక్కువగా ఉండటం గమనించాం. ఈవిధంగా ఇక్కడ ఉండటం పరిపాటే అయినా ఈ ప్రాంతంలో చాలా ఎక్కువగా ఉన్నట్లు అనిపించింది. వాకబు చేయగా చెట్ల ఆకులు పశువులకి దాణాగా పనికి వస్తాయని, పైగా ఎండాకాలంలో వచ్చే పెను గాలుల నుండి పొలాలను ఈ చెట్లు రక్షిస్తాయని స్థానికులు చెప్పారు. ఈ చెట్లు వీరు కావాలని నాటినవి కావట, ఒంటెలతో కాని, ఎడ్లతో కాని పొలాన్ని దున్నేటపుడు ఈ చిన్న మొక్కలను తప్పించి దున్నుతారట. అలా అవి పెరిగి, పెద్దవైన తర్వాత వారి పశువులకి, పొలానికి సహాయకారిగా ఉంటున్నాయట. కానీ ట్రాక్టర్లతో దున్నటం మొదలయ్యాక ఈ చిన్ని మొక్కలని తప్పించటం కష్టమౌతుందని చెప్పారు వారందరూ. అక్కడి పొలాలలో నడుస్తూవుంటే స్ప్రింక్లర్లకై పైపులు వేయటానికి భూమిని తవ్వటానికి ప్రత్యేకంగా తయారు చేసుకున్న ట్రెంచర్‌ని చూశాం. అక్కడ ఒక గృహస్తురాలు మమ్మల్ని వారింట్లోకి ఆహ్వానించి చల్లని మజ్జిగను అందించింది. కొంచెం సేద తీరిన తర్వాత ఆవిడకి ధన్యవాదాలు చెప్పి అక్కడివాళ్ళ మంచితనాన్ని నెమరు వేసుకుంటూ ముందుకు సాగాము. మార్గంలో ఒక పాడుబడిన భవంతిని చూశాం. అది పడిపోయే పరిస్థితుల్లో వున్నా, చాలా అందంగా ఉంది. వాళ్ళు ఇళ్ళను కట్టుకునే పద్ధతికి, వాటిని అలంకరించే పద్ధతి చూసి ఆశ్చర్యపడుతూ ముందుకు సాగాము.

మొహల్దా గ్రామంలో గ్రామస్తులు మొదట మేము చెప్పిన సాంప్రదాయ వ్యవసాయ పద్ధతిని ఒప్పుకోలేదు. ఎంతో శక్తివంతమైన రసాయన ఎరువులు వాడుతున్నా, నియంత్రణలోకి రాని చీడ పీడలు ఈ సేంద్రియ పద్ధతులతో ఎలా అరికట్టబడతాయి అన్నారు. మేము వారికి సేంద్రియ పద్ధతిలో క్రిములు సంహరింపబడవు కాని, అవి పంటను నాశనం చేసే వాటి శక్తిపై పనిచేస్తాయి అని వివరించాం. ఒప్పుకున్నారు. అక్కడి స్థానిక మహిళలు వాళ్ళు చేసిన వంటకాలు, అలంకరణ వస్తువులను తెచ్చి చూపించారు. వాటిలో మాకు ప్రత్యేకించి కుండలు నెత్తిపైన పెట్టుకునేటప్పుడు ఉపయోగపడే సాధనం చాలా నచ్చింది. అక్కడి స్త్రీలు ఎంతో కష్టపడుతూ కూడా అలంకరణకు ఇచ్చే ప్రాధాన్యత చూసి మాకు ముచ్చటేసింది. వాళ్ళు కష్టాన్ని మర్చిపోవడం అన్నది వస్తువుల అలంకరణ ద్వారా సాధిస్తున్నారేమో అనిపించింది.

'రాటా' గ్రామంలో 'దేవ్‌దత్‌సింగ్' అనే వ్యక్తిని సన్మానించాం. ఆయన తన జీవితమంతా ప్రార్థనా మందిరాలలో పాఠశాలలలో, స్మశాన వాటికలలో, ఎక్కడ ఖాళీ చోటు ఉంటే అక్కడ చెట్లను నాటుతూ వుంటాడట. నాటడమే కాదు, రోజూ ఉదయం వాటిని నీరు పోసి రక్షిస్తాడట. మండే ఎండలున్న ఈ ప్రాంతంలో సమాజానికి ఇంత మంచి పని చేస్తున్నాడు కదా అనిపించింది. ఆయన శ్రావణమాసం (ఆగస్టు)లో గుళ్ళకు వచ్చేవారు దానం చేసిన గింజలను జాగ్రత్త చేసి, సంవత్సరం పొడవునా పక్షులకి దాణాగా వేస్తాడు ఈపని ఆయన ఎంతో శ్రద్ధగా, దీక్షగా,




సేవాతత్పరతతో చేస్తూ వుంటాడు. ఆయనని అభినందించి ముందుకు సాగాము.

యాత్రీకులము అందరం 'డీరోలీ జాట్' గ్రామం చేరుకున్నాం. అక్కడ చక్కటి అందమైన పూలు, పళ్ళతోటలను చూశాం. అక్కడ పళ్ళ తోటల్లో దాదాపు 50 శాతం పళ్ళని పక్షులు తినేస్తూ వుంటాయి. దానిని నిరోధించటానికి అక్కడివారు ఏవిధమైన రసాయనాలు వాడకుండా, కేవలం పాత సీడీలని పక్షులను పారదోలటానికి చెట్లపై కడతారు. ఇలా ఎందుకు మీ పళ్ళని మీరు రక్షించుకోరా అని అడిగితే అవికూడా జీవించాలి కదా సార్ అన్నారు. అక్కడే ఉత్తర ప్రదేశ్‌నుండి వచ్చి భూమి కౌలుకు తీసుకొని కూరగాయలు పండించే ఒక ముస్లిం కుటుంబం తారస పడింది. వారు తమ ఇంటి బయట, లోపల చేసిన అలంకరణ చూసి చాలా ఆశ్చర్యపోయాం. వారిని అభినందించి ముందుకు సాగాము. డీరోలీ జాట్ గ్రామంలో పెద్ద సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామంలో పెద్దమనిషి 'రాంపాల్' అనే వ్యక్తి తాతగారు ఆ సభకి అధ్యక్షత వహించారు. కేంద్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌తో పాటు, అనేకమంది శాస్త్రవేత్తలు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశంలో ముఖ్యమైన భాగం 'రాంపాల్' తయారు చేసిన 'కంప్రెస్డ్ ఎయిర్ కార్' చాలా మందికి నచ్చింది. ఇది గాలితో నడిచే కారు. కాకపోతే ప్రస్తుతం అది ఒక్కసారి ట్యాంకులో గాలి నింపితే 5 కి.మీ. నడుస్తుంది. దీన్నే భవిష్యత్తులో ఇంకా ఎక్కువ మొత్తంలో గాలి నింపే ట్యాంకులు ఏర్పాటు చేసి ఉపయోగిస్తే ఎక్కువ దూరం ప్రయాణించటానికి వీలవుతుంది. అక్కడి మహిళలు, పిల్లలు తాము గీసిన చిత్రపటాలు, అలంకరణ వస్తువులు ఎంతో ఉత్సాహంగా ప్రదర్శించి, తమ సృజనాత్మకతను చాటుకున్నారు. ప్రవీణ్ అనే పిల్లవాడు వృద్ధులు బస్సు ఎక్కేటపుడు మడవటానికి వీలుగా వుండే మెట్లు ఉంటే బావుంటుందని సూచించాడు. అంజలి అనే అమ్మాయి సీటు బెల్టు పెట్టుకుంటే తప్ప కారు స్టార్ట్ కాని పద్ధతిని సూచించింది. ఈమధ్యనే ఒక కేంద్ర మంత్రిగారు ప్రమాదంలో మరణించినప్పుడు తనకు ఆ ఆలోచన వచ్చిందని, కారు డ్రైవరు, పక్కన కూర్చునే వ్యక్తే కాకుండా వెనక సీటులో కూర్చునే వారు కూడా సీటు బెల్టు పెట్టుకుంటే తప్ప కారు స్టార్ట్ కాకూడదు అని చెప్పింది. ఒక కారు ప్రమాద సంఘటన ఆమె సృజనాత్మకతపై ఎంతటి ప్రభావం చూపించింది కదా అని అనిపించింది. 'ఓంవీర్' అనే ఒక మెకానిక్ చవకగా తాను తయారు చేసిన ఒక మోటర్ వైండింగ్ యంత్రాన్ని చూపించాడు. బజార్లో దాని ఖరీదు రూ. 20 వేలకి పైగా వుంటుందని, తాను తయారు చేసింది కేవలం రూ. 3 వేలకే దొరుకుతుంది అని చెప్పాడు. అతన్ని మనసారా అభినందించి ముందుకు సాగాము.

'షాబాజ్‌పూర్' గ్రామంలోని ఒక చాయ్ దుకాణం దగ్గర ఆగాము. అక్కడ ఆల్మటాస్ చెట్లకి వున్నన్ని పసుపు పచ్చని పూలు మేమెక్కడా చూడలేదు. అందరికీ టీ ఇమ్మని కొట్టతనితో చెప్పి చుట్టుప్రక్కల వాళ్ళతో స్థానికంగా ఉండే ఇన్నోవేషన్లను గురించి చర్చ మొదలు పెట్టాము. ముందు వారేమీ చెప్పలేకపోయినా మేము దేశంలో జరిగే చిన్న, పెద్ద ఇన్నోవేషన్లను గురించి వారికి వివరిస్తూ వుండగా స్ఫూర్తి





పొంది సుజీత్ అనే పిల్లవాడు తనకి ఒక ఇన్నోవేటర్ రైతు తెలుసు అని చెప్పాడు. అతన్ని ఒక వాహనంపై పంపి 'మహారాం' అనే ఆ రైతును అక్కడికి తీసుకు రమ్మని పంపాం. అతడు పక్క గ్రామం నుంచి వచ్చి తాను సైకిల్ ఆధారంగా జొన్నలు విత్తే యంత్రాన్ని తయారు చేసానని చెపుతూ తన యంత్రం వాడటం వలన విత్తనాలు ఒకటి, ఒకటిన్నర అంగుళాల లోతునే పడతాయని, మొక్కలు త్వరగా వస్తాయని, అదే పెద్ద యంత్రాలు లేదా ట్రాక్టర్ల సహాయంతో విత్తితే విత్తనాలు ఇంకా లోతుకు పడిపోయి, త్వరగా రావని, తన పద్ధతిలో 20 శాతం ఎక్కువ ఫలసాయం వస్తుందని వివరించాడు. అప్పుడు ఖరీదైన పెద్దపెద్ద యంత్రాలకన్నా అందరికీ అందుబాటులో వుండే చిన్న యంత్రాలు ఎంతో మేలు కదా అని మాకనిపించింది.

ఆ ప్రాంతంలో మద్యపానం బెడద చాలా తీవ్రంగా ఉంది. దారి పొడవుననే కాకుండా డిరోలీ జాట్ గ్రామంలోనే 5 మద్యం విక్రయ దుకాణాలున్నాయి. ఇళ్లల్లో మరుగుదొడ్లు లేవు కాని, ఈ మద్యం, ధూమపానం మాత్రం ప్రతి ఇంట్లో వుంది. వీటివలన ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. ముఖ్యంగా యువతపై దీని ప్రభావం ఎక్కువగా ఉంటోంది. ఈ ప్రాంతం నుండి చాలామంది సైన్యంలో చేరిపోయారు. బహుశా స్థానిక సమస్యల నుండి పిల్లలను కాపాడటానికి పెద్దలే దీన్ని ప్రోత్సహిస్తున్నారేమో! ఆ ప్రాంతంలో తాగే నీటిలో ఫ్లోరైడ్ శాతం పరిమిత స్థాయికన్నా ఎక్కువగా ఉంది. ప్రత్యేకించి ఈ పరిస్థితి 'అంతరి' గ్రామంలో ఎక్కువగా ఉంది. దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టవలసి వుంది.

మేము ఆ రాత్రి 'మందాన' గ్రామంలో నిద్రచేశాం. అక్కడికి దగ్గరలోనే ప్రఖ్యాత యోగా గురువు రాందేవ్ గారు పుట్టిన ఊరు ఉందట. ఆయన చదివిన బడి కానీ, పుట్టిన ఊరుగానీ అభివృద్ధికి నోచుకోలేదని స్థానికులు వాపోయారు. అక్కడి పిల్లలు చాలా మంచి ఆలోచనలు చెప్పారు. 'జ్యోతి' అనే అమ్మాయి మనం తినే మాత్రలు కాలపరిమితి (ఎక్స్‌పయిరీ డేట్) అయిపోగానే రంగు మారిపోయేలా వుంటే బావుంటుందేమో అని చెప్పింది. అలా వుంటే ప్రత్యేకించి చదువు రాని వారికి, ముసలి వారికి బావుంటుంది కదా అన్నదామె. 'వైభవ్' అనే విద్యార్థి నీటిని వృధా చేయకుండా వాడిన నీటికి కరీదు కట్టే ఎటియం లాంటి పద్ధతి ఉంటాలంటాడు. 'టీనా' అనే అమ్మాయి 'ఫ్యాన్‌కు రెండువైపులా గాలి వచ్చే సదుపాయం వుంటే బావుంటుంది కదా అన్నది. 'ప్రియాంక' అనే అమ్మాయి 'సాధారణంగా పిల్లలు సెల్‌ఫోన్‌లో మాట్లాడేటప్పుడు తాము ఎక్కడినుంచి మాట్లాడుతున్నామో చెప్పటం లేదని, సెల్‌ఫోన్‌లో జిపియస్ పద్ధతి లాంటివి వుండి వారు ఎక్కడినుంచి మాట్లాడుతున్నారో తెలిసిపోయేలా వుంటే బావుండు అన్నది. 'సరోజ్' అనే అమ్మాయి మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను నివారించాలంటే సెల్‌ఫోన్లో ఒక అత్యవసర బటన్ ఉండాలని, అది నొక్కితే దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కి సమాచారం వెళ్ళేలా వుండాలని అన్నది.

మా యాత్రలో శతాధిక వసంతాలు పూర్తి



**అంతరించిపోతున్న జీవరాసులను ముందు తరం వాళ్ళు చూడాలని మీరు కోరుకుంటున్నారా?**



చేసుకున్న వృద్ధులని, ఉద్యోగాలు చేస్తూనే సమాజానికి సేవ చేసిన కళాశాల, పాఠశాల అధ్యాపకులని, సంఘ సేవకులని, సృజనాత్మకతను వెల్లడించిన పిల్లలని, అభ్యుదయ రైతులని, మెకానిక్‌లని సన్మానిస్తూ మీ దగ్గరనుండి మేము ఎంతో నేర్చుకున్నామని చెప్పాము. ఇది చెపుతూ వుంటే మాకు 'కట్‌తోలి' గ్రామంలో 'హేతురాంజీ' గుర్తుకు వచ్చాడు. ఆయన రోజుకి 700 బస్తీలు తీసేవాడట. ఆ రోజుల్లో రోజుకి పావుకిలో నెయ్యి తాగేవాడట. దానికి తగ్గ పని చేసేవాడట.





ఇలా ఎన్నో అనుభవాలు మిగిలిపోయాయి ఈ యాత్రలో.

మా శోధయాత్ర ఒక పాఠశాల వద్ద సమాప్తమైంది. విడిపోయే ముందు కూడా మా యాత్రీకులు స్కూలు బయట వాహనాల టైర్లలో గాలి నింపే వ్యక్తి తన కంప్రెషర్‌లో చిన్న చిన్న మార్పులు చేసి దానిని సమర్థవంతంగా పనిచేసేలా చేసిన వైనాన్ని గురించి మాట్లాడుతూనే వున్నారు! భౌతికంగా మా యాత్ర అక్కడితో సమాప్తమైంది. కానీ మా యాత్రీకులు అందరి మనసులకీ తెలుసు మా యీ శోధయాత్ర అన్నది మా జీవితాంతం కొనసాగుతూనే వుంటుందని. ఈ ప్రాంతాన్ని మరువలేం. ఎక్కడా ఒక్క బక్కచిక్కిన పిల్లవాడు లేని ప్రాంతం. తమకెన్ని సమస్యలున్నా వాటిని మర్చిపోయి పరాయివాళ్లని కూడా ఆప్యాయంగా, సంతోషంగా పలుకరించే మనుషులున్న ప్రాంతం. దేశానికి ఎందరో వీరసైనికులని పంపిన ప్రాంతం. మరువలేం. ఎప్పటికీ మరువలేం.

మన దేశాన్ని పట్టి పీడిస్తున అనేక సమస్యలకి ఇటువంటి చిన్నచిన్న ప్రాంతాలనుండే పరిష్కారాలు వస్తాయేమో! అధికారంలో వున్న వ్యక్తులు ప్రత్యేకించి ఆలోచిల్సిన విషయమిది. ●

# వివిధ రాష్ట్రాల నుండి సేకరించిన పల్లె జ్ఞానం

**పశువులలో అతిసార నివారణకు చింతచెట్టు బెరడుతో చికిత్స:**

ఇన్నోవేటర్ : **మంజులాబేన్ ధీరూభాయ్ పటేల్,** భాతా ఫల్యా గ్రామం, ఖాట్వాడీ పోస్ట్ & తాలూకా, వాల్సర్ జిల్లా – 396385, గుజరాత్. **మొబైల్ : 099046 52689.**

కొన్నిసమయాలలో పశువులు పచ్చిమేత ఎక్కువగా తిని, లేదా చెడిపోయిన, కుళ్ళిపోయిన పదార్థాలు తిన్న ఫలితంగా అతిసార వ్యాధి బారిన పడుతుంటాయి. పేడలో దుర్భరమైన వాసన వుండి, రక్తము, చీము కూడా పడుతూ వుంటాయి. దీనికి సరియైన జాగ్రత్త తీసుకోకపోతే పశువు చనిపోయే ప్రమాదం కూడా ఉంది. దీని నివారణకై మంజులా భేన్ చింతచెట్టు బెరడును వాడుతుంది. ఆమె 500 గ్రా. చింతచెట్టు బెరడును తీసుకుని బాగా ఎండబెట్టి, కాల్చి బూడిద చేస్తుంది. రెండు స్పూన్ల ఈ బూడిదలో 300 మి.లీ. నీటిని జోడించి, బాగా కలిపి పశువుకి రోజుకి రెండుసార్లు



చొప్పున రెండు రోజులపాటు తాగిస్తుంది. దీంతో మంచి ఫలితం ఉంటుంది. తానీ పద్ధతిని తన తండ్రివద్ద నేర్చుకున్నానని, ఇప్పటికీ ఇదే వాడుతున్నానని చెప్పారామె. వైద్యం జరుగుతున్నపుడు పశువుచేత ఏవిధమైన పచ్చిదాణా తినిపించకూడదు. నీరు మాత్రం సమృద్ధిగా తాగిస్తూ వుండాలని జాగ్రత్తలు చెప్పిదామె.

**2. పశువు తిరిగి చూలుకు రాకపోతే నెమలి ఈకతో వైద్యం:**

ఇన్నోవేటర్ : **కాంజీభాయ్ ధాన్‌జీ ఠాకూర్,** టోరారా గ్రామం, హార్జీ తాలూకా, పాతాన్ జిల్లా. గుజరాత్. **మొబైల్ : 078742 95588.**

ఒకసారి ఈనిన పశువులు ఒక్కొక్కప్పుడు రెండవసారి చూలుకు రావటం ఆలస్యమవుతూ వుంటుంది. ఇటువంటి సందర్భాలలో తాను చెప్పిన చిట్కా వాడితే మంచి ఫలితం ఉంటుందని అంటున్నారు కాంజీభాయ్. నెమలి ఈకలోని వెంట్రుకల కొసభాగాలను కత్తిరించి, సజ్జ



రొట్టెలలో చుట్టి పశువుచేత తినిపించాలి. ఇలా ఒక్కసారి మాత్రమే చేయాలి. దీనివలన పశువు తిరిగి చూలుకు వచ్చే అవకాశాలు మెరుగుపడతాయి.

ఈ పద్ధతిని మేమూ పరీక్షించి సఫలీకృతమైనామని చెప్తున్నారు ప్రతాప్‌జీ ఠాకూర్, కాలోజీ ధాంజీ ఠాకూర్, కానాభాయ్, ఖేంగాభాయ్, బార్వాద్‌లు.

**3. వంగ తోటలో ఆకుముడత పురుగు నివారణ:**

ఇన్నోవేటర్ : **ముఖేష్ భాయ్ అమతాభాయ్ రబారీ,** బిలియా గ్రామం, సిద్ధాపూర్ తాలూకా, పాతన్ జిల్లా. గుజరాత్. **మొబైల్ : 096381 95920.**

వంగ తోటల్లో ఆకుముడత పురుగు పెద్ద సమస్యగా వుంటుంది. వాతావరణం మబ్బుగా వుండి, మంచు ఎక్కువ కురుస్తున్న ప్రదేశాలలో రసం పీల్చే పురుగు చేరి అది ఆకుముడతకు దారి తీస్తుంది. దీనివలన వంగచెట్టు కొత్త ఆకులు వేయలేదు, చిగురు కూడా రాదు. పర్యావసానంగా పంట దిగుబడి దెబ్బతింటుంది. ఇటువంటి పరిస్థితుల్లో ముఖేష్ భాయ్ రాబరి జిల్లేడు, గన్నేరు, గోమూత్రం, నాచు ఉపయోగించి స్వంతంగా క్రిమి సంహారిణిని తయారు చేసుకుంటారు.

దీనికై రెండున్నర కిలోల జిల్లేడు ఆకులు, రెండున్నర కిలోల గన్నేరు ఆకులను మెత్తగా నూరి, ఆ మిశ్రమానికి 10 లీటర్ల నీటిని జోడించి సన్నని సెగపై చాలాసేపు మరగనివ్వాలి. చల్లారిన తర్వాత ఆ మిశ్రమంలో రెండున్నర లీటర్ల గోమూత్రము, ఒక కిలో నాచు/ పాచిని



కలిపి 24 గంటలసేపు కదలకుండా ఉంచాలి. తర్వాత ఈ మిశ్రమాన్ని వడకట్టి, 500 మి.లీ. ద్రావణాన్ని పంటపై పిచికారి చేయాలి. ఈవిధంగా రోజు విడిచి రోజు చొప్పున ఆరు రోజులపాటు పిచికారి చేయాలి. దీనితో పంటను ఆశించిన తెగులు నశించి కొత్త చిగురు వేసి పంట పూతకు వస్తుంది.

చుట్టుప్రక్కల రైతులు కూడా ఈ ద్రావకం పనితీరును గమనించి తాముకూడా తమ పంటల్లో ఉపయోగిస్తున్నారు. నాచు, పాకుడుని తప్పనిసరిగా 24 గంటలసేపు ద్రావకంలో తప్పనిసరిగా ఉంచటం వలన మంచి ఫలితాలు వస్తాయట. పిచికారి చేసేటపుడు ఆకులన్నీ పూర్తిగా తడిసేలా తగు జాగ్రత్త తీసుకోవాలి

ముఖేష్‌భాయ్ రాబరీ తనకున్న 5 బీగాల పొలంలో కాయగూరలే కాక, పశువులకై గడ్డిని కూడా పెంచుతూ వుంటాడు. మూడవ తరగతి వరకే చదువుకున్న ఇతను గత 32 సంవత్సరాలుగా కొత్త విషయాలను తెలుసుకుని సేంద్రియ వ్యవసాయంలో కొత్త పద్ధతులను అవలంభిస్తూ వుంటాడు.

**4. కాయగూరల్లో తెల్లదోమ నివారణకి మందు:**
ఇన్నోవేటర్ : **మంగళ్‌భాయ్ ధాంజీభాయ్ బోయా**, తనికీ గ్రామం, ధర్మపూర్ తాలూకా, వాల్సాద్ జిల్లా. గుజరాత్.
**మొబైల్ : 097242 50739.**

ప్రత్యేకించి చలికాలంలో చిక్కుడు మరియు ఇతర కూరగాయల పంటలకి తెల్లదోమ, రసంపీల్చే ఆకుపచ్చ పురుగులు సాధారణంగా ఆశిస్తూ వుంటాయి. నీరుపెట్టే పంటలపై ఇవి ఎక్కువ ప్రభావాన్ని చూపుతాయి. ఇటువంటి పరిస్థితి వచ్చినపుడు మంగళ్‌భాయ్ బూయా వేపాకు, గోమూత్రంతో క్రిమి సంహారక మందును తయారు చేసుకుంటూ వుంటాడు. ఆయన తన వంగ, చిక్కుడు పొలంలో ఈ తెల్లదోమ, రసంపీల్చే పురుగులు కనిపించి నపుడు 5 కిలోల సన్నగా తరిగిన వేపాకులను 10 లీటర్ల నీటిలో కలిపి 2 రోజులు మురగబెడ్తాడు. ఆ తర్వాత ఈ ద్రావకాన్ని వడకట్టి ఈ మిశ్రమానికి 3 లీటర్ల గోమూత్రాన్ని కలుపుతాడు. 3 లీటర్ల ఈ ద్రావకాన్ని పురుగు సోకిన పంటపైన మూడురోజులకొకసారి చొప్పున పురుగు నశించేంత వరకు పిచికారి చేస్తూ వుంటాడు. కొన్ని సమయాలలో ఈ రసంపీల్చే పురుగు నాశనం కాకపోయినా, ఈ మందులోని చేదు రుచి వలన అవి మొక్కల రసాన్ని పీల్చటం మానేస్తాయి. గోమూత్రం క్రిమి సంహారిగానే కాకుండా మొక్క ఎదుగుదలకు కూడా సహాయకారిగా వుంటుంది. ఈ పద్ధతిని తమ పూర్వీకులనుండి పాటిస్తున్నామని చెప్తున్నాడు మంగళ్‌భాయ్. ●



## గ్రామీణ సృజనాత్మక శక్తికి వేదిక 'పల్లెసృజన'

'పల్లెసృజన' ఒక వేదికగా ఉపయోగపడాలంటే మీరు మీ సమస్యలను, ఆలోచనలను, జ్ఞాన సంపదను సంకోచించకుండా మాకు పంపండి. ఎంత చిన్న ఆలోచన అయినా సరే మేము ఆహ్వానిస్తాం. మీ సమస్యలను 'పల్లెసృజన'లో ప్రచురిస్తాం. వాటికి పాఠకులు సమాధానాలు పంపితే వాటిని కూడా ప్రచురిస్తాం. మన సమస్యలు బహిరంగ వేదికపై పెట్టి సమాజం నుండి పరిష్కారాలను ఆహ్వానించడమే 'పల్లెసృజన' ఉద్దేశ్యం. అందరూ సహకరించి ఈ గ్రామీణ సృజనాత్మక శక్తి వెలుగుదారుల వేదికను సద్వినియోగం చేసుకుంటారని ఆశిస్తున్నాం. **- ఎడిటర్**

**'పల్లెసృజన' సంఘం గురించి పది మందికి చెప్పండి, పత్రికకు చందా కట్టండి, కట్టించండి, పల్లెజ్ఞానాన్ని విస్తరింపజేయండి**

# తెలుగు ఇన్నోవేటర్లకు సత్కారాలు




సోలార్ స్ప్రేయర్ తయారుచేసిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్ బొమ్మగాని మల్లేశంను 27 జనవరి, 2015 నాడు తెలంగాణ ఎన్.ఆర్.ఐ. అసోసియేషన్ వారు సత్కారం చేశారు.



తెలంగాణ రాష్ట్రానికి చెందిన "నెహ్రూ యువ కేంద్ర సంఘటన్" వారు గ్రామీణ ప్రాంతాలలో పౌష్టిక ఆహారం తయారు చేస్తున్న నిజామాబాద్‌కు చెందిన మహిళా గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్ శ్రీదేవికి ఒక లక్ష రూపాయల నగదు బహుమతితో పాటు, మెమెంటోను ఇచ్చి సత్కరించారు..

స్పందన

# Connecting Village knowledge to Villages




http://pallesrujana.org/

23 Districts
(AP & Telangana)

1000
Villages in each district

Each Pallesrujana magazine costs Rs 200/-

Adopt a district – Rs 2 lakhs per dist.

Adopt 500 villages – Rs 1lakh

Adopt 100 villages – Rs 20,000

Individual | Individual | Individual

**Adopt a district; Adopt villages; Spread the awareness; Lets connect village knowledge to villages**

నేను ఒక్కడినే కాని ఒంటరి వాడిని కాదు. ప్రతి పనీ నేను చేయలేకపోయినా ఏదైనా మాత్రం తప్పకుండా చేయగలను. నాకు చేతనైన పని చేయటానికి నేనెప్పుడూ వెనకాడను. – హెలెన్ కెల్లర్. – **ఇ. సురేష్,** న్యూజెర్సీ, అమెరికా. (సూరి బ్లాగ్)

సురేష్ గారికి నమస్కారములు, పల్లెసృజన పత్రిక ప్రతి గ్రామానికి చేరాలనే 'జ్ఞానయజ్ఞం'లో మీరు పాలుపంచుకుంటానని ముందుకు రావటం చాలా సంతోషకరం. మీలాంటివారి స్వచ్ఛంద సహకారంతో జ్ఞానయజ్ఞ ఆశయాలు త్వరలోనే సాధించగలమన్న మా నమ్మకానికి బలం చేకూరుతుంది. "మే యువర్ ట్రైబ్ ఇంక్రీజ్". **– ఎడిటర్**

**ఎడిటర్ గారికి నమస్కారములు,**

'పల్లెసృజన' పత్రికను గత 5 సంవత్సరాలుగా చదువుతున్నాను. ఎన్నో రకాల ఇన్నోవేషన్‌లను సమాజానికి, ముఖ్యంగా రైతాంగానికి పరిచయం చేస్తున్నందుకు ధన్యవాదములు. ఈ పత్రికలలో ముఖ్యంగా "ఎడిటోరియల్" నన్ను చాలా బాగా ఆకట్టుకుంది. ముఖ్యంగా ఇందులో ఎంచుకుంటున్న అంశాలు యధాతథంగా రైతాంగం మదిలో మెదిలేవే కావటం నాకెంతో ఆనందాన్నిస్తోంది. మీ భావాలకు నేను పూర్తిగా ఏకీభవిస్తున్నాను అని మనస్ఫూర్తిగా తెలియజేస్తున్నాను.

**– ఆర్. విజయభాస్కర రెడ్డి,** పులకుర్తి గ్రామం, కర్నూలు జిల్లా.

**ఎడిటర్ గారికి,**

'పల్లెసృజన' ఆగస్టు–సెప్టెంబర్ సంచిక చదువుతుంటే చాలా తృప్తిగా ఉంది. ముఖ్యంగా బోరుబావిలో ఊటను పెంచే ప్రయత్నం చేసిన గురుమూర్తి అభినందనీయులు. ఆలోచింపజేసే ఇలాంటి ఉత్తమ అంశాలను మాకు అందిస్తున్న 'పల్లెసృజన' సంపాదకవర్గానికి మా కృతజ్ఞతలు. **– భవనం జయరామి రెడ్డి,** 79 తాళ్ళూరు, గుంటూరు జిల్లా.

**ఎడిటర్ గారికి నమస్కారములు,**

'పల్లెసృజన' నవంబర్–డిసెంబర్–2014 సంచికలో "సంపాదకీయం" నన్ను చాలా బాగా ఆకట్టుకుంది. భాషపరంగా, భావ పరంగా ఉత్తమంగా ఉంది. రైతుల ఎదుర్కొంటున్న సమస్యలపై సంపాదకీయంలో చర్చించడం గమనార్హం.

**– ప్రొ. డి.వి.ఆర్. విఠల్, హైదరాబాద్.**

# రైతులకోసం రైతులు కనిపెట్టిన సేంద్రియ క్రిమి సంహారక మందులు

## తులసి




పంటల ఎదుగుదలకు, వైరస్ నివారణకు సేంద్రియ మందు

## పర్‌ఫెక్ట్




వరిలో సుడిదోమ పత్తి, మిరప, ఇతర కూరగాయ పంటలను ఆశించే రసం పీల్చే పురుగు, తెల్లదోమ, పచ్చదోమ, పిండినల్లి మొదలైన వాటిని సమర్థవంతంగా నివారిస్తుంది

## సృష్టి కృషక్




పంటల ఎదుగుదలకు, ఆకుముడత తెగులు నివారణకు సేంద్రియ మందు

## సృష్టి సుదర్శన్




పంటల ఎదుగుదలకు, కూరగాయల పంటలలో పురుగుల నివారణకు సేంద్రియ మందు

## సృష్టి సర్వత్ర




పంటల ఎదుగుదలకు, రసం పీల్చే పురుగు నివారణకు సేంద్రియ మందు

## సృష్టి ప్రహార్




పంటల ఎదుగుదలకు, పిండినల్లి నివారణకు సేంద్రియ మందు

## సృష్టి ప్రయాస్




పంటల ఎదుగుదలకు, పూత రాలుట నివారణకు సేంద్రియ మందు

## సృష్టి శక్తి



పంటల ఎదుగుదలకు సేంద్రియ మందు

## సృష్టి శస్త్ర




పంటల ఎదుగుదలకు, తామర పురుగు, తెల్లదోమ, శనగపచ్చ పురుగుల నివారణకు సేంద్రియ మందు

## సృష్టి కె&సి




పంటల ఎదుగుదలకు, బ్యాక్టీరియా, ఫంగస్ నివారణకు సేంద్రియ మందు

## సృష్టి సురక్ష



పంటల ఎదుగుదలకు, చెదల నివారణకు సేంద్రియ మందు

## సృష్టి రక్షక్




పంటల ఎదుగుదలకు, పత్తి పంటలో పురుగుల నివారణకు ఎంద్రియ మందు

పశువుల ఆరోగ్యం 'బోయ పెద్దరాజన్న' వైద్యం

**'కుంటా' వ్యాధి మందు**

(నరాల బలహీనతతో కాళ్ళు చచ్చుపడిపోవడం)



2 వెల్లిపాయలు, 20 మిరియాలు పొడిలో కలిపి మరి వేడినీటిలో కలిపి ఒకరోజు ఉదయం మరియు సాయంత్రం పశువుకు త్రాగించాలి.
ఈ ప్యాకెట్‌లోని మందు ఒకరోజు పశువుకు త్రాగించడానికి ఉపయోగ పడుతుంది.

మీ అభిప్రాయాలను మాకు తెలపండి

**క్రియేటివ్ మైండ్స్**

ఫోన్ : 040-27111959
ఇ-మెయిల్ : creativemindsap@gmail.com

**పశువైద్యంలో పేరెన్నికగన్న అనంతపురం జిల్లా వాసి బోయ పెద్దరాజన్న తయారు చేసిన పశువుల మందులు**

పశువుల ఆరోగ్యం 'బోయ పెద్దరాజన్న' వైద్యం

**'పొదుగువాపు' వ్యాధి మందు**



ప్యాకెట్‌లోని సగం పొడిని వేడినీటిలో కలిపి వాచిన పొదుగుకు పట్టించాలి. రెండురోజులు వరుసగా పొదుగుకు పట్టించినచో పొదుగు మామూలుగా మారి పాలు పితకడానికి వీలవుతుంది.

మీ అభిప్రాయాలను మాకు తెలపండి

**క్రియేటివ్ మైండ్స్**

ఫోన్ : 040-ఫోన్ : 040-27111959
ఇ-మెయిల్ : creativemindsap@gmail.com

**కావలసినవారు సంప్రదించవలసిన చిరునామా :**


క్రియేటివ్ మైండ్స్, పల్లెసృజన కార్యాలయము, 67, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-27111959, సెల్ : 91777 52753


PALLESRUJANA Telugu Bi-monthly 20/- Jan - Feb 2015 RNI No. APTEL 12136/01/01/2011-TC

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?


ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే











## చందా వివరాలు

| వివరములు | వ్యక్తిగతం | సంస్థ/లైబ్రరీ |
|---|---|---|
| సంవత్సరానికి | 200/- | 800/- |
| రెండు సంవత్సరాలకి (ఒక పాత సంచిక ఉచితం) | 350/- | 1,400/- |
| మూడు సంవత్సరాలకి (రెండు పాత సంచికలు ఉచితం) | 500/- | 2,000/- |
| ఐదు సంవత్సరాలకి (నాలుగు పాత సంచికలు ఉచితం) | 800/- | 3,200/- |

పల్లెసృజన చందాదారులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. చందాదారులుగా చేరాలనుకున్నవారు ఈ క్రింది చిరునామాకు మీ యం.ఓ.లు పంపండి. మీ చిరునామా స్పష్టంగా వ్రాయటం మరవకండి.

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-27111959, సెల్ : 9866001678
E-mail : anchor@pallesrujana.org Visit us : www.pallesrujana.org

లేదా నేరుగా ఈ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయండి.

మీ చిరునామాను స్పష్టంగా మాకు వ్రాసి పంపండి లేదా యస్.యం.యస్. లేదా ఇ-మెయిల్ చేయండి.

M/s Pallesrujana, Syndicate Bank, Sainikpuri, Secunderabad.
SB A/c No. 30232200019150, IFS Code : SYNB0003023

Narendra Grafix, Hyd. Ph.: 81257 99904